# అపరిచిత గద్య కరదీపిక

# అపరిచిత గద్య కరదీపిక

వేణువర్ధన్ సముద్రాల

JUSTWRITE.IN
HYDERABAD

*అపరిచిత గద్య కరదీపిక by Venuvardhan Samudrala is licensed under a Creative Commons Attribution-NonCommercial-ShareAlike 4.0 International License, except where otherwise noted.*

# అంకితం

పరిస్థితుల పర్జన్య ప్రభావంతో
ప్రభవించని పండితాదిత్యుడు

నాన్నకు.....ఇష్టంతో..



సముద్రాల వేంకటాచార్యులు (సంస్కృతాంధ్ర

భాషా ప్రవీణులు)

తెలుగు ప్రశ్నపత్రములలో అపరిచిత గద్యాంశమును ఇచ్చి దాని కింద ప్రశ్నలు అడిగి, సమాధానం రాయమనే విధానం అటు సీ.బీ.ఎస్.ఈ లోనూ, ఇటు స్టేట్ పరీక్షలలోనూ ఉన్న విషయం సుపరిచితమే. దీనిని మనం **స్థూల అవగాహన** అంటున్నాం. విద్యార్థులలో అవగాహనా సామర్థ్యాన్ని పరీక్షించడానికి స్థూల అవగాహన ఒక బలమైన అంశం . అయితే విద్యార్థులు పుస్తక పఠనంలో అనేక మెళకువలను పాటించాలి. ప్రధానంగా చదివే విషయం మీద దృష్టి ఉంచాలి. చదివే పేరాలో ఏ అంశం గురించి ప్రస్తావిస్తున్నారో గమనించాలి. అందులో ప్రస్తావనకు వచ్చే అంశాలను క్రమ పద్ధతిలో గుర్తుంచుకోవాలి. అలా చేసినప్పుడు మనకు విషయం మీద సమగ్ర అవగాహన ఏర్పడుతుంది. అవగాహన లేకుండా ఎన్ని పుస్తకాలు తిరగేసినా, ఎన్ని గంటలు చదివినా ప్రయోజనం శూన్యం. కాబట్టి విద్యార్థులలో **అవగాహనా సామర్థ్యాలను** పరీక్షించడానికి **విషయ ప్రాధాన్యత**ను బట్టి పేరాలను ఎంపిక చేసుకొని వారిచేత చదివించాలి.ఆ తర్వాత దానిని వారెంతవరకు అర్థం చేసుకున్నారో తెలుసుకోవడం కోసం చిన్న చిన్న ప్రశ్నలు అడగాలి.

అపరిచిత గద్యాంశమును ప్రశ్నగా అడిగే విధానం చిన్న తరగతుల నుండి పోటీపరీక్షల వరకు ఉందనడంలో అనుమానం ఎవరికీ ఉండదు. నిజానికి అపరిచిత గద్యాంశం ఇవ్వడం ఒక కళ. అయితే గత పది సంవత్సరాలుగా నేను పరిశీలించిన అనేక పాఠశాలల గద్యాలు నాలో ఏదో అసంతృప్తిని కలిగించాయి. ఒకచో అంశం ఫరవాలేదు అనిపించినా, దాని క్రింద ప్రశ్నల తయారీ మాత్రం ఏమంత హాయిని ఇవ్వలేదు. అందుకే నేను ఈ పనికి శ్రీకారం చుట్టాను. నా దృష్టిలో అపరిచిత గద్యాంశం అంటే దాని ప్రారంభవాక్యమే చదువరిని లాగి బుట్టలో వేసుకోవాలి. దీనికి విషయంలో ఆకర్షణతో పాటు, చదువరికి రసజ్ఞత అవసరం. ఇన్విజిలేషన్ చేస్తున్న తెలుగు చెప్పని ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులు సైతం ప్రశ్న పత్రం చేతిలోకి తీసుకుని పూర్తిగా చదివి తృప్తితో నిట్టూర్చాలి. ఇచ్చిన ఉపాధ్యాయ మిత్రుడిని పలకరించాలి, ప్రశంసించాలి. అందులో ఉపాధ్యాయుడి వ్యక్తిత్వం బహిర్గతం కావాలి. మొత్తానికి గద్యాంశం ప్రశ్నపత్రానికి ప్రాణమై వెలగాలి. అంతేనా? విద్యార్థి ఇంటికి వెళ్లేలోపు ఇంట్లో వారితో సహా ప్రశ్న పత్రం చూసిన ప్రతి ఒక్కరి నోళ్ళల్లో అది చిందులు వేయాలి. అదీ నిజంగా గొప్ప అపరిచిత అంశం అంటే. విద్యార్థి నైతిక, విజ్ఞాన వికాసంలో వీటి పాత్ర చాలా గొప్పది కనుక వీటి విషయంలో శ్రద్ధ తప్పనిసరి.

*అందుకే మీ చేతులకు వీటిని ఇలా అలంకరిస్తున్నాను..*

ఈ పుస్తకంలోని అపరిచితాల సంఖ్య 64. ఇందులో కొన్ని నా ఆలోచనల నుండి పుట్టినవైతే, మరికొన్ని ఇదివరకే రచయితలో, కవులో తమ పుస్తకాలలో రాయగా అవి సులభంచేసి పొందుపరచినవి. వారి పుస్తకాలు చదువుతున్నపుడు మంచి విషయం అని నాకు అనిపించినభాగాలు ఇందులో ఉంచడం జరిగినది. ఇలా ఎంపిక చేసుకోవడం చాలా కష్టమనీ, అందుకు పరిశీలన ఎంతో అవసరం అని అనుభవంలోకి వచ్చింది. మరికొన్ని అనేక పుస్తకాలు, వారపత్రికలు, ఆదివారం ప్రత్యేకతలు మొదలైన వాటి నుండి స్వీకరించి విషయానుకూలంగా కుదించి ఇచ్చినవి. ఇలా అనేకం.... సందర్భాన్ని బట్టి పుస్తకం, దాని రచయిత పేరును కూడా గద్యాంశం క్రింద ఇవ్వడం జరిగింది. గ్రహించగలరు. మొదటి ఐదు అపరిచితాలకు మాత్రం బహుళైచ్ఛిక ప్రశ్నలతో పాటుగా వాటి సమాధానాలు ( ఎం. సి. క్యూ) కూడా అందిస్తున్నాను. తర్వాత కేవలం ప్రశ్నలు మాత్రమే ఉనాటాయి. వాటికి అనుకూలంగా బహుళైచ్ఛిక ప్రశ్నలు (ఎం.సీ.క్యూ.లు) మీరు తయారు చేసుకోవలసి ఉంటుంది.

సమాధానాలలో ఒకటి సరైనది ఇచ్చి, మిగిలిన మూడు సమాధానాల పదాలను అర్థరహితంగా, విరిచి , భాష కాని విధంగా ఇవ్వడం అనేకులు తయారు చేయగా నేను గమనించాను. ఇది నిందించడం కాదు సహజంగా జరుగుతున్నది మీకు చేరవేయడం మాత్రమే. కానీ బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాలలో ఒకటి సరైన జవాబు ఉండి మిగిలినవి ఎలాగైనా ఇవ్వవచ్చు అనే భావన తప్పు. అన్నీ అర్థవంతంగా , వ్యాకరణ సహితంగా ఉండాలి. అప్పుడే విద్యార్థికి పద సంపద పక్కదారి పట్టకుండా లాభిస్తుంది. ఈ పుస్తకంలోని గద్యాంశాలను పరిశీలించి, చిన్న పొరపాట్లు ఏవైనా ఉంటే సూచించి, ఆదరిస్తారని కోరుకుంటూ.. అనేకమంది ఉపాధ్యాయ మిత్రులకు, విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుందని నమ్ముతున్నాను. ఈ పనికి నన్ను ప్రోత్సహించి, దీని ఉపయోగపరిధిని పెంచిన శ్రీమతి సుషుమ్న రావు తాడినాడ గారికి ప్రత్యేక నమస్కారాలు. అలాగే అడిగినదే తడవుగా పుస్తకం పై తమ అమూల్యమైన అభిప్రాయాలు రాసి ఇచ్చిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు.

*About this Openbook*

ఈ సంవత్సరం 2024 ఓపెన్ ఎడ్యుకెషన్ వీక్ లో భాగంగా , పై పుస్తకంలోని **25 గద్యాంశాలను ఓపెన్ లైసెన్స్ తో 2024 మార్చి** మొదటి వారంలో ఇక్కడ అందిస్తున్నాము.

# రచయిత గురించి

*నా గురించి ఓ చిన్న మాట...*

పది సంవత్సరాలపాటు నల్లగొండ జిల్లా పరిసర ప్రాంతాలలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో తెలుగు అధ్యాపకులుగా పనిచేశాను. 2010 నుండి ప్రఖ్యాత విద్యాసంస్థ" భారతీయ విద్యా భవన్ "లో తెలుగు శాఖాధిపతి గా, తెలుగు బోధకులుగా పనిచేస్తున్నాను. పదుల సంఖ్యలో పత్రికలకు వివిధ అంశాలపై వ్యాసాలు రాశాను. దాదాపు 700 వేదికలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చాను.

నేటి వేగవంతమైన సమాజంలో విద్యార్థులు పక్కదారి పట్టకుండా, బోధనలో నైతిక అంశాలు జోడించి వారిలో ప్రత్యక్షంగా మంచి మార్పును చూస్తూ, ఇక ముందు చదివే వారిలో కూడా మార్పుకై కసితో పనిచేయడమే నా లక్ష్యం.

**వేణు వర్ధన్ సముద్రాల**
బి. ఏ (తెలుగు) ఎం.ఏ (తెలుగు) టి. పి. టి.

తెలుగు శాఖాధిపతి

భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్

బి. హెచ్. ఈ. ఎల్ , Hyderabad, India.

(కవి,గాయకుడు, వ్యాఖ్యాత, వక్త)

venuvardhan.samudrala@gmail.com.

Mobile: 9640444499

# చిన్ని పొత్తమునకు ఎన్నెన్ని కానుకలో...

నా ఈ ప్రయత్నాన్ని అభినందిస్తూ, నేను మరిన్ని వ్రాయడానికి నన్ను ప్రోత్సహిస్తూ పలువురు పెద్దలు తమ వాత్సల్యాన్ని ప్రకటించారు. వారు అందించిన ఈ కానుకలు అమూల్యమైనవి. అందుకు వారికి నా మనః పూర్వక ధన్యవాదాలు, నమస్సులు.

హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ – తెలుగు ప్రొఫెసర్ **శ్రీ పమ్మి పవన్ కుమార్ గారు**, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ **శ్రీ అవినాష్ గారి** నుంచి వచ్చిన స్పందనలను ఇక్కడ పొందుపరచాము. మరికొందరి స్పందనలు త్వరలో జోడిస్తాము.

## <u>ప్ర హ్లా దం</u>

తెలుగు భాషకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ప్రపంచ సాహిత్యంతో పోటీపడగల కావ్యాలు, ప్రబంధాలు, పురాణ, ఇతిహాసాలున్నాయి. శాఖోపశాఖలుగా విస్తరిల్లిన విజ్ఞాన గ్రంథాలున్నాయి. ప్రపంచసాహిత్యంలో ఏ ఇతర భాష, సాహిత్య రంగాలతో పోల్చుకొన్నా అబ్బురపరిచే ఘనమైన భాష, సాహిత్య వారసత్వసంపద మనకు ఉంది.

సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని మనం అనుభూతించడం, అనుభవిచడంతోపాటు, మన వారసత్వ సంపదగా తరువాతి తరాలకు అందించవలసిన బాధ్యత మనందరిపైన ఉంది. బోధన-అభ్యసనాలు, కొత్త సాహిత్య సృష్టి, సాహిత్యరూపాల-శాఖల విస్తరణ, వివిధ అవసరాలకు తెలుగుభాషను వినియోగంలోకి తెచ్చుకొనే ప్రయత్నం... మొదలైన వాటిలో ఇప్పటికే అనుసరిస్తున్న పద్ధతులకు తోడుగా ఎలక్ట్రానిక్ (సంగణక) అనువర్తనలను జోడించడంద్వారా మనకు, మనతరాలకు కలిగే ఫలితాలు ఎక్కువ. విద్యారంగంలో వివిధ స్థాయిలలో ఎలక్ట్రానిక్ సమాచార నిధుల అవసరం అపారంగా ఉంటుంది. కాని, వినియోగించుకోదగిన రీతిలో లభ్యమవుతున్న ఆకరాల సంఖ్య తక్కువ. తెలుగుభాషలో లభ్యమవుతున్నవి మరీ తక్కువ.

ఈ లోటును భర్తీ చేసేందుకు కృషిచేస్తున్న కొద్దిమందిలో శ్రీ సముద్రాల వేణువర్ధన్(తెలుగు శాఖాధిపతి, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్, బి.హెచ్.ఇ.ఎల్., హైదరాబాదు) కాస్త చురుకైన వరుసలో నిలుస్తారు. అపరిచిత *గద్య కరదీపిక* అనే పేరుతో, అపరిచిత గద్యాంశాలను రూపొందించే ప్రక్రియలోని మెళకువలను ఓపెన్ లైసెన్స్ కలిగిన ఎలక్ట్రానిక్ పుస్తక రూపంలో ఆయన మనముందు ఆవిష్కరిస్తున్నారు. ఇటువంటి పాఠ్య, పఠనీయ

గ్రంథాలకు స్థల, కాల అవధులను అధిగమించే వెసులుబాటువుంటుంది. దీర్ఘ కాలంపాటు సమాచారాన్ని నిలువ ఉంచుకోవచ్చు. అవసరాలకు అనుగుణంగా- పెంచుకోడం, కుదించడం, మార్పులు చేసుకోడం, పునర్నవీకరించడం, వివిధ అవసరార్థులకు పఠనీయ సమాచారాన్ని అందుబాటులో ఉంచడం... మొదలైన పనులన్నీ సులభంగా చేయవచ్చు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఉన్న సమాచారానికి ఉన్న అదనపు సౌకర్యమూ, ప్రయోజనమూ, ఆకర్షణా ఇది.

రాష్ట్ర, జాతీయ స్థాయిలలోని విద్యామండళ్ళు నిర్వహింపచేసే పరీక్షలలోనూ, వివిధ పోటీపరీక్షలలోనూ అపరిచిత గద్యాంశాలను ఇచ్చి, తరువాత అడిగిన ప్రశ్నలకు సమాధానాలను గుర్తించమనడం ఉంది. గద్యపఠనంలో విద్యార్థుల అవగాహనను మూల్యాంకనం చేయడానికి పనికివచ్చే ప్రయోజనకరమైన పద్ధతి ఇది. "*నా దృష్టిలో అపరిచిత గద్యాంశం అంటే దాని ప్రారంభవాక్యమే చదువరిని లాగి బుట్టలో వేసుకోవాలి. దీనికి విషయంలో ఆకర్షణతోపాటు, చదువరికి రసజ్ఞత అవసరం. ఇన్విజిలేషన్ చేస్తున్న తెలుగు చెప్పని ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులు సైతం ప్రశ్నపత్రం చేతిలోకి తీసుకుని పూర్తిగా చదివి తృప్తిగా నిట్టూర్చాలి. ఇచ్చిన ఉపాధ్యాయ మిత్రుడిని పలకరించాలి, ప్రశంసించాలి. అందులో ఉపాధ్యాయుడి వ్యక్తిత్వం బహిర్గతం కావాలి. మొత్తానికి గద్యాంశం ప్రశ్నపత్రానికి ప్రాణమై వెలగాలి. అంతేనా? విద్యార్థి ఇంటికి వెళ్ళేలోపు ఇంట్లో వారితో సహా ప్రశ్నపత్రం చూసిన ప్రతి ఒక్కరి నోళ్ళల్లో అది చిందులు వేయాలి. అదీ నిజంగా గొప్ప అపరిచిత అంశం అంటే. విద్యార్థి నైతిక, విజ్ఞాన వికాసంలో వీటి పాత్ర చాలా గొప్పది కనుక వీటి విషయంలో శ్రద్ధ తప్పనిసరి*" అంటున్నారు రచయిత ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో. ఇవన్నీ గద్యబోధన, అభ్యసనాలలో ఒక పార్శ్వాన్ని ప్రతిపాదిస్తున్న అంశాలు.

గద్యబోధన, అభ్యసనాలలో గుర్తుంచుకోవలసిన మరో పార్శ్వం ఉంది. చరిత్ర-సంస్కృతి, భాషలు, విజ్ఞానశాస్త్రం, జీవిత/వ్యక్తి చరిత్ర, దేశ/ప్రాంత పరిచయం, జీవజాలం-జీవావరణం, జాతిగౌరవం... మొదలైన అంశాలకు సంబంధించిన విషయాలను ఈ గద్యలలో పరిచయం చేశారు. ఇవి సాహిత్య గద్యలు కావు; విషయ నివేదన గద్యలు. విషయ నివేదన గద్యకు భావ ప్రకటన ప్రధానం. విషయ పరిజ్ఞానాన్ని పెంపొందింపజేయడం, భాషా ప్రయోగ/వినియోగ నైపుణ్యాభివృద్ధిని కలిగించడం, విషయ ప్రకటన-గ్రహణాలలో ప్రాధాన్యక్రమాన్ని గుర్తించడం, కేంద్రాభిప్రాయాన్ని పట్టుకోగలగడం, భాష వాడకంలో శైలీభేదాలను గుర్తించి సార్థకంగా వినియోగంలోకి తేగలిగే నైపుణ్యాన్ని వృద్ధిచేయడం... మొదలైనవి విషయ నివేదన గద్యను పరిచయంచేయడంలో కీలకమైన పాత్రను పోషిస్తాయి.

ఒక్క ముక్కలో- సాహిత్యగద్య హృదయ సంబంధి; విషయ నివేదనగద్య బుద్ధిసంబంధి. ఈ రెంటిని అన్ని తరగతులలోనూ, స్థాయిలలోనూ సమతూకంగా నేర్పగలిగినపుడు తెలుగు భాష మరింత పరిపుష్టమవుతుంది. వ్యవహార రంగాలన్నిటికీ విస్తరించగలుగుతుంది. ఇది కొండంత లక్ష్యం; బహు కష్టసాధ్యమని ఊరుకోకుండా ఈ-గ్రంథ రచనతో లక్ష్యాన్ని చేరుకొనే పనిని ప్రారంభించిన రచయితను, ఈ మార్గంలో విశేషమైన కృషిచేసి, రచయితను ఈబాట పట్టించిన విదుషీమణి శ్రీమతి సుషుమ్నారావుగారిని హృదయపూర్వకంగా

అభినందిస్తున్నాను. ఈ గ్రంథంలోని ప్రతి గద్యకు చివరన బహుళైచ్ఛిక ప్రశ్నలున్నాయి. ఇంటరాక్టివ్ అభ్యాసాలున్నాయి. ఇవి విద్యార్థుల అభ్యసనంలో ఎంతో సహకరిస్తాయి. జ్ఞానార్జన స్థాయిని అంచనావేసుకోడంలో కీలకమైన ఇటువంటి స్వీయ పరీక్షాంశాలను మరిన్నిటిని ఈ-గ్రంథంలోని గద్యలకు జోడించే అవకాశం ఉంది. తెలుగు భాషకు, విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఉపయోగకరమైన ఇటువంటి ప్రయత్నాలను ప్రహ్లాదంతో ఆహ్వానిస్తున్నాను. వీరిరువురి వృద్ధిని, భాషాభివృద్ధిని నిండు మనసుతో కాంక్షిస్తున్నాను. – *Prof. Dr.* PAMMI PAVAN KUMAR *– Professor of Telugu & Head, Centre for Endangered Languages and Mother Tongue Studies, School of Humanities, University of Hyderabad, Hyderabad* – 500 046, *TS., India. – Ph: office* – 040-2313 3562, M: +91-98664 86934, *e-mail: pavankpammi@uohyd.ac.in*

---

## Helpful book

This book is very helpful for the students or the learners who are interested in learning language skills. The diverse topics make the learning process interesting and really engages the learners. Generally unseen passages are boring and it meets the temporary need of students but does not create interest to know about what is been discribed in it. The author has done tremendous job to select the various topics and also the questions of all the topic are designed or planned well. – Dr.K.Avinash – Assistant Professor-Hindi

PART I

# త్వరలో వస్తున్నాం...

*ఈ సంవత్సరం 2024 ఓపెన్ ఎడ్యుకెషన్ వీక్ లో భాగంగా ,* ***25 గద్యాంశాలు*** *గల ఈ పుస్తకాన్ని ఓపెన్ లైసెన్స్ తో ఉచిత విద్యా వనరుగా e-పుస్తకంగా విడుదల చేస్తున్నాం!*

*ముందుమాటలో ప్రస్తావించినట్లుగా మొత్తం 64 గద్యాంశాలు, అలాగే*

- *అపరిచిత గద్యం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?*
- *అపరిచిత గద్యం ప్రక్రియ ప్రాముఖ్యత*
- *అపరిచిత గద్యం ఎలా రాయాలి?*

*వంటి ప్రశ్నలకు సమాధానాలను ప్రింటు రూపంలో ఖరీదుకు ఇవ్వడం జరుగుతుంది. పుస్తకం కావలసిన వారు సంప్రదించాల్సిన చిరునామా :*

వేణువర్ధన్ సముద్రాల B.A. ( tel Lit.) M.A.(Tel) T.P.T. venuvardhan.samudrala@gmail.com.

Mobile: 9640444499

PART I

# అపరిచిత గద్యాలు

25 గద్యాంశాల ఈ పుస్తకాన్ని CC BY-NC-SA 4.0 ఓపెన్ లైసెన్స్ తో 2024 మార్చి మొదటి వారంలో అందించే ప్రయత్నం చేస్తున్నాం! చదువరులు ఈ పుస్తకాన్ని డౌన్ లోడ్ చేసుకునే సదుపాయమూ ఉంటుంది. అయితే తిరిగి ఈ పుస్తకంలోని విషయాలను వాడుకోదలచుకుంటే CC BY-NC-SA 4.0 ఓపెన్ లైసెన్స్ అనుసరించి ఆయా నిబంధనలకు లోబడి వాడుకోవలసి ఉంటుంది.

# 1. అపరిచిత గద్యం-1

"తెలంగాణ" గురించి ఉన్న మొట్టమొదటి శాసనం క్రీస్తు శకం 1417 వ సంవత్సరం లోనిది. దీనిని మెదక్ జిల్లా, రామచంద్రాపురం, తెల్లాపూర్ గ్రామంలో రాష్ట్ర పురావస్తు శాఖ శాసన పర్యవేక్షణ వారు కనుగొన్నారు. ఈ శాసనంలో "తెలంగాణ పురం" అనే పట్టణంలోని విశ్వకర్మలకు చెందిన కొండమీది మల్లోజు అనే వ్యక్తి మనుమలు ఒక దిగుడు బావిని తవ్వించారనీ, దానికి ఉత్తరాన మామిడి తోటను పెంచి ఏతాం ద్వారా నీటి సరఫరా చేశారనే వివరాలు ఉన్నాయి. 1510 వ సంవత్సరంలో వెలిచెర్ల శాసనం లో ప్రతాపరుద్ర గణపతి అనేక తెలంగాణ దుర్గాలను గెలిచినట్టు ఉన్నది. తమిళనాడులో ఉన్న తిరువన్నామలై శాసనంలో "దెలంగాణ్య" మని శ్రీకృష్ణదేవరాయలు తెలంగాణ గురించి రాయించాడు. 15వ శతాబ్దపు చివరి భాగంలో వెన్నెలకంటి సూరన కవి రాసిన విష్ణు పురాణం అవతారిక (పరిచయ పేజీల్లో ) లో తెలంగాణ ప్రస్తావన ఉన్నది. తెలంగాణ అన్నమాట కనీసం 1400 సంవత్సరం నాటికి స్థిరపడి ఉన్నా , తెలంగాణ అన్న పేరు పడిన భూభాగాలకు చరిత్ర ఎప్పటినుంచో ఉన్నది. ఆదిరాజు వీరభద్రరావు" తెలంగాణ భూభాగపు అత్యంత ప్రాచీన కాలము నుండి తెలుగు వారికి స్థావరమై ఉంది. శాతవాహనులు, చాళుక్యులు, కాకతీయులు ఈ ప్రాంతంలో విజృంభించి ఎంతో గొప్పగా తమ పరిపాలన కొనసాగించారు. ఎన్నో గొప్ప విశేషాలతో ఈ హైదరాబాదు రాజ్యము పునీతమై ఉన్నది". అని వారి మాటల్లో చెప్పడం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రతిభ ఎంత కీర్తి గడించినదో చెప్పవచ్చు.

**ప్రశ్నలు:**

1.తెలంగాణలో అనేక దుర్గాలను గెలిచిన రాజు ఎవరు?

అ) ప్రతాపరుద్ర గణపతి ఆ) కృష్ణదేవరాయలు ఇ) సూరన ఈ) వీరభద్రరావు

2. విష్ణు పురాణం రాసిన కవి ఎవరు?

అ) వీరభద్రరావు ఆ) సూరన ఇ) మల్లోజు ఈ) కృష్ణదేవరాయలు

3. తెలంగాణ గురించి తెలిపే మొట్టమొదటి శాసనం ఏ సంవత్సరం లోనిది.

అ) 1417 ఆ) 1510 ఇ) 1400 ఈ) పైవేవీ కావు

4. 1510 వ సంవత్సరంలో బహిర్గతమైన శాసనం పేరు.

అ) వెలిచర్ల శాసనం ఆ) బెజవాడ శాసనం ఇ) అద్దంకి శాసనం ఈ) అమరావతి శాసనం

5.ఎన్నో గొప్ప విశేషాలతో హైదరాబాదు రాజ్యము పునీతమై ఉన్నది. అన్నమహనీయుడు ఎవరు?

అ) సూరన  ఆ) మల్లోజు  ఇ) కృష్ణదేవరాయలు ఈ) ఆదిరాజు వీరభద్రరావు

ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ గారు రాసిన తెలంగాణ సాహిత్య వికాసం నుండి సేకరణ

---

*Interactive Exercise-1*

*An interactive H5P element has been excluded from this version of the text. You can view it online here:*
*https://pressbooks.justwrite.in/telugugadyaamsaalu/?p=53#h5p-2*

# 2. అపరిచిత గద్యం-2

మనదేశంలో కేవలం ముగ్గురు నలుగురికి మాత్రమే ఉన్న అత్యంత అరుదైన బ్లడ్ గ్రూప్ "పీ-నల్". ఆ బ్లడ్ గ్రూప్ కోసం ఆ మధ్య ఒక డాక్టర్ పెద్ద యుద్ధమే చేసింది. గుజరాత్ కు చెందిన ఒక పాప మెట్ల మీద నుండి పడి తీవ్ర గాయాల పాలయ్యింది. దాదాపుగా కోమాలోకి వెళ్లే పరిస్థితి. ఆ పాపను చివరికి ఎర్నాకులంలో "అమృత" హాస్పిటల్ లో చేర్పించారు. అక్కడి డాక్టర్ వీణా షేనాయ్. పాపది "పీ-నల్ " బ్లడ్ గ్రూప్ అని తెలుసుకుంది. ఆ రక్తం ఎక్కిస్తేనే పాప బతుకుతుంది. అందుకే దేశ విదేశాల్లోని బ్లడ్ బ్యాంకులను సంప్రదించింది. కార్పొరేట్ ఉద్యోగుల డేటా సేకరించింది. చివరకు ట్విట్టర్లో అధిక పరిచయాలు కలిగిన శశి థరూర్ తో పోస్ట్ చేయించింది.ఇక దేశం మొత్తం అన్వేషణ మొదలైంది. అయితే నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనో హెమథాలజీకి చెందిన డాక్టర్ స్వాతి కులకర్ణి నాసిక్ ప్రాంతంలోని ఒక వ్యక్తికి ఈ బ్లడ్ గ్రూప్ ఉందని చెప్పారు. వీణా షేనాయ్ నాసిక్ కు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి చేరుకుని , అతడిని బ్లడ్ బ్యాంకుకు తీసుకువచ్చి , పరీక్షలు చేసి , అతడిది "పీ-నల్" బ్లడ్ గ్రూప్ అని తేల్చి , ఓ కొరియర్ సర్వీసు తో మాట్లాడి సరైన చల్లదనం పాటించే కంటైనర్ లో రక్తాన్ని ఎర్నాకులం తెప్పించి, పాపకు ఆపరేషన్ చేసి బతికించింది. ఇప్పుడు పాప కోలుకుంది. మంచి జీవితం ప్రారంభించింది. ఒకరికి మేలు జరగడం కోసం మనం ఎంత శ్రమ తీసుకున్నా తప్పులేదు. అది చాలా గొప్ప విషయం కదా !

ప్రశ్నలు:

1.స్వాతి కులకర్ణి ఏ సంస్థకు చెందిన వైద్యురాలు ?

అ) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఆ) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెమథాలజీ ఇ) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమృత హాస్పిటల్ ఈ) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ లాంగ్వేజ్

2. వీణా షేనాయ్ పనిచేస్తున్న వైద్యశాల ఎక్కడ ఉంది?

అ) ఎర్నాకులమ్ ఆ) గుజరాత్ ఇ) నాసిక్ ఈ) ఏవీకావు

3. పాప గురించి ట్విట్టర్లో పోస్ట్ చేసింది ఎవరు?

అ) స్వాతి కులకర్ణి ఆ) వీణా షేనాయ్ ఇ) శశి థరూర్ ఈ) ఎవరూ కారు

4. " పీనల్ " బ్లడ్ గ్రూప్ ఎర్నాకులం ఎలా చేరింది ?

అ) వీణా షేనాయ్ కారులో ఆ) స్వాతి కులకర్ణి విమానంలో ఇ) కొరియర్ సర్వీస్ కంటైనర్లో ఈ) చల్లదనం ఉన్న రైలులో

5.పాప గాయాలకు కారణం ఏమిటి?

అ) మెట్లమీది నుండి పడటం ఆ) దెబ్బలు కొట్టడం ఇ) వాహనం ఢీ కొట్టడం ఈ) చెట్టుపైనుండి పడటం

*Interactive Exercise-2*

*An interactive H5P element has been excluded from this version of the text. You can view it online here:*
*https://pressbooks.justwrite.in/telugugadyaamsaalu/?p=55#h5p-1*

# 3. అపరిచిత గద్యం-3

జీవిత చరిత్రలను రాయడం సామాన్యమైన విషయం కాదు. జీవిత చరిత్రను కూలికి వ్రాయువారు చాలామంది వున్నారు. తమ పొట్ట నింపుకొనుటకై శక్తి సంపన్నులను సకల అలంకారాలతో వర్ణించి రావణుడిని రామునిగా, హిరణ్యకశిపుని హిరణ్య గర్భునిగా, పోతరాజును భోజరాజుగా, పిసినారిని దానకర్ణునిగా చిత్రించి నవ్వుల పాలు అయ్యే వారు చాలామంది ఉన్నారు. అటువంటి చరిత్ర రచనలు నాలుగు దినాల పాటు కూడా నిలువవు. జాన్సన్ చరిత్ర రాసిన బాస్వెల్ కు దమ్మిడి లాభం కూడా లేదు. కానీ అది మాత్రం ఈ లోకంలో గొప్ప చరిత్రగా పేరు గడిచింది.జీవిత చరిత్రలను కొని చదవండి అంటే ప్రజలు వాటితో పాటు అమృతాంజనం కూడా ఒకటి కొనుక్కోవాలి అని అంటూ ఉంటారు. అంటే అవి నీరసముగా ఉంటాయని ఆలోచిస్తారు.జీవిత చరిత్రను రాసే రచయిత తన గ్రంథాన్ని అందంగా , ఆకర్షణీయంగా వినోదానికి కారణం అయ్యేట్టు గా చేయడానికి అబద్ధాలను , తన సొంత పైత్యాన్ని గ్రంథంలో నింపితే అది కేవలం చిన్న పిల్లలు చదువుకునే కథల పుస్తకంగా మారుతుంది. ఏది చెప్పినప్పటికీ సత్యమే చెప్పాలి. చక్కగా చెప్పాలి.ఆ విధంగా చెప్పిన వాడే ఘనుడు.రచయిత శైలి ద్వారా చాలా రమ్యతను తన గ్రంథానికి చేకూర్చగలడు. కాబట్టి జీవిత చరిత్రలకు" శైలి" చాలా ముఖ్యమైనదిగా ఉంటుంది.

**ప్రశ్నలు:**

1.జీవిత చరిత్రలు రాసేవారు తమ సంపాదన కోసం పిసినారిని ఎలా చూపిస్తారు?

అ)రామునిగా ఆ)భోజరాజుగా ఇ) దానకర్ణునిగా ఈ) బ్రహ్మగా

2.జాన్సన్ చరిత్ర రాసింది ఎవరు?

అ) బాస్వెల్ ఆ) జాన్సన్ ఇ) సంపన్నులు ఈ) ఎవరుకారు

3. " శైలి" ఏ రచనకు ప్రధానమైనది.

అ) ఆత్మకథలు ఆ) జీవిత చరిత్రలు ఇ) లేఖలు ఈ) వ్యాసాలు

4.ఎటువంటివాడు ఘనుడు అవుతాడు .

అ) కథలు చెప్పినవాడు ఆ) వినోదం ఇచ్చేవాడు ఇ) సత్యాన్ని చెప్పేవాడు ఈ) నవ్వు తెప్పించేవాడు

5.జీవిత చరిత్రలు చదవమంటే ప్రజలు కొనుక్కోవాలనుకునేది ఏది?

అ) జండూ బామ్ ఆ) జిందా తిలసమాత్ ఇ) అ,ఆ రెండూ ఈ) అమృతాంజనం

*Interactive Exercise-3*

*An interactive H5P element has been excluded from this version of the text. You can view it online here:*
*https://pressbooks.justwrite.in/telugugadyaamsaalu/?p=59#h5p-3*

# 4. అపరిచిత గద్యం-4

స్వాభిమానం సభ్య లక్షణం, దురభిమానం ధూర్త లక్షణం, నిరభిమానం నిర్వీర్య లక్షణం. అప్పుడెప్పుడో డాక్టర్ సి.నారాయణరెడ్డి అన్న మాటలు ఇవి. నా భాష, నా సంస్కృతి, నా కళలు, నా చారిత్రక వారసత్వం గొప్పది అనుకోవడం స్వాభిమానం. అది ఉత్తమ లక్షణం. మరి నావే గొప్పవి అనుకోవడం శృతిమించితే ఏర్పడేది దురభిమానం. అలా భావించేది చెడ్డవారు మాత్రమే. ఆ మనకెందుకులే! అంటూ ఆసక్తి లేకుండా ఉండడం, నీరసమైన మాటలు పలకడం ఏ అభిమానం లేని వాడి లక్షణం. అది చేతగానితనం మాత్రమే. ఆంగ్ల పాలన నుంచి మన దేశాన్ని విముక్తం చేయాలని మనం జరిపిన స్వాతంత్ర్య సంగ్రామం స్వాభిమాన సంకేతమే. ఆ తర్వాత పరిపాలన నుంచి మనం విముక్తులమయ్యామే గాని, ఆలోచనల్లో ఇంకా పరాధీనులు గానే ఉన్నాం. ఆంగ్లభాష ,ఆ పాశ్చాత్య సంస్కృతి మన మెదల్ల పొరలలో ఇంకా పేరుకొనే ఉన్నాయి. ఇది భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తించే సత్యమైన మాట. తెలుగు భాష అత్యంత సంపన్నమైన భాష. ఇటీవల 2008 సంవత్సరాని కంటే ముందుగానే పాశ్చాత్య విజ్ఞాన వేత్త ప్రొఫెసర్ హాల్డెన్ ఏ సాంకేతిక వైజ్ఞానిక అర్ధాన్ని అయినా సమర్థంగా చెప్పే పద సంపద తెలుగు భాషకు ఉన్నదని గుర్తించి చెప్పారు. ఇద్దరు సగటు తెలుగువారు కలుసుకుంటే సంభాషణల్లో దొర్లేవి ఇంగ్లీష్ మాటలే. ఇలా అనడం ఇంగ్లీష్ కు నిరసన తెలపడం కాదు. మాతృభాష అవసరాన్ని గుర్తించడం. ఏ భాషా పదాన్ని అయినా తనలో జీర్ణించుకునే శక్తి తెలుగు భాషకు ఉంది ఇంగ్లీషు , హిందీ, ఉర్దూ పదాలనే కాదు అల్మారి, ఇస్త్రీ లాంటి పోర్చుగీసు పదాలను కూడా తెలుగు భాష తనలో కలుపుకుంది. దక్షిణాఫ్రికా స్వతంత్ర దేశంగా రూపొందిన తర్వాత ఆ దేశం మంత్రి మండలిలో "జులూ" అనే ఆటవిక తెగకు చెందిన ప్రతినిధులు ఉన్నారు. జులూ తెగకు భాష లేదు. యాస తప్ప. ఆ యాస భాషను, ఆటవిక సంస్కృతిని పరిరక్షించుకోవడానికి జులూ నాయకులు ఉద్యమాలు నడిపారు. అది స్వాభిమానం అంటే. ఒక యాస కోసం, అభివృద్ధి చెందని ఒక సంస్కృతి కోసం ఆ తెగవారు ప్రదర్శనలు జరిపారంటే ఆ సంఘటనల ద్వారా మన నాగరీకులు నేర్చుకోవాల్సింది చాలా ఉంది.

ప్రశ్నలు..

1. ఏ సాంకేతిక అర్థాన్ని అయినా చెప్పే పద సంపద తెలుగుకు ఉన్నదని అన్నది ఎవరు ?

అ) హాల్డెన్ ఆ) జులూ ప్రతినిధులు ఇ) సి. నారాయణరెడ్డి ఈ) ఎవరూ కాదు

2. మనకెందుకులే! అనుకొని నీరసంగా మాట్లాడటం ఎవరి లక్షణం?

అ) జులూ లక్షణం  ఆ) ధూర్త లక్షణం  ఇ) అభిమానం లేనివాడి లక్షణం  ఈ) దక్షిణాఫ్రికా లక్షణం

3. ఆల్మారీ , ఇస్త్రీ మెదలైనవి ఏ భాషా పదాలు?

అ) తెలుగు  ఆ) ఇంగ్లీష్ ఇ) పోర్చుగీసు  ఈ) హిందీ

4. "జులూ" తెగ ఏ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఏర్పడింది?

అ) భారత దేశం  ఆ) ఫ్రాన్స్  ఇ) జర్మనీ  ఈ) దక్షిణాఫ్రికా

5. ఇద్దరు తెలుగు వారు కలుసుకుంటే మాటల్లో దొర్లేవి…

అ) పోర్చుగీసు పదాలు  ఆ) ఇంగ్లీష్ పదాలు  ఇ) జపనీస్ పదాలు  ఈ) సంస్కృత పదాలు

---

*Interactive Exercise-4*

*An interactive H5P element has been excluded from this version of the text. You can view it online here:*
*https://pressbooks.justwrite.in/telugugadyaamsaalu/?p=60#h5p-4*

# 5. అపరిచిత గద్యం-5

నిజాం కాలంలోని తెలంగాణ పరిస్థితుల గురించి అబద్ధపు ప్రచారం ప్రచారం చేసి విజయం సాధించామని కొందరు తృప్తిపడి ఉండవచ్చు. ఆ కాలాన్ని కేవలం రాచరికానికి, నిరంకుశత్వానికి, భూస్వామ్యానికి, చిమ్మ చీకటికి, దోపిడీకి, దౌర్జన్యానికి మాత్రమే పరిమితం చేసి, అనేకమంది అదే ప్రచారం చేశారు. కానీ ఇక్కడి పాలకులు ముందుకు అడుగు వేయలేదా? మౌనాన్ని నాశనం చేస్తూ ఇక్కడ ఏ గొంతులూ చెడును గట్టిగా వ్యతిరేకించలేదా? కొత్త గాలి తమ ఇంట్లోకి రావాలని ఎవ్వరూ తమ కిటికీలను తెరచి ఉంచలేదా? ఇటువంటి ప్రశ్నలన్నింటికీ జవాబే ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ రచించిన" తెలంగాణ సాహిత్య వికాసం" అనే పుస్తకం. ఆధునిక కాలంలోకి తెలంగాణను నడిపించడానికి మొదట చిన్న చిన్న అడుగులతోనే ప్రయాణం ప్రారంభమైంది. ఆ నడకే మహా కవాతుగా రూపుదిద్దుకున్నది. అక్షరాస్యులే అతి తక్కువగా ఉన్న తెలంగాణ సమాజంలో గ్రంథాలయాల కోసం ఉద్యమాలు జరిగాయి. పోస్ట్ ఆఫీస్ లేని, రహదారులే లేని ఒక చిన్న గ్రామంలో ఉత్సాహవంతుడైన ఒకరు పత్రికనే ప్రారంభించారు. "తెలంగాణలో కవులు లేరు" అని అన్న మాటకు నొచ్చుకొని ఒక సంపాదకుడు ఏకంగా కవుల సంచికనే, అంటే తెలంగాణలో ఉన్న కవుల జాబితాను, వారి రచనలను కుప్పగా పోసి అలా మాట్లాడినవారి నోరు మూయించి మన ఆత్మాభిమానాన్ని ప్రకటించాడు. ఇలా ప్రతి తెలంగాణ విద్యావంతుడు తెలుసుకోవలసిన అనేక సత్య విషయాలను కె. శ్రీనివాస్ గారు తమ తెలంగాణ సాహిత్య వికాసంలో పొందుపరిచారు.

ప్రశ్నలు:

1. ఆధునికత వైపు తెలంగాణను నడిపించడానికి మొదట ప్రయాణం ఎలా ప్రారంభమైంది?

అ) ఉరుకులు పరుగులతో ఆ) చిన్న చిన్న అడుగులతో ఇ) ఆట పాటలతో ఈ) ముసి ముసి నవ్వులతో

2. "తెలంగాణ సాహిత్య వికాసం" రచయిత ఎవరు?

అ) కె. శ్రీనివాస్ ఆ) డి. శ్రీనివాస్ ఇ) మిమిక్రీ శ్రీనివాస్ ఈ) ప్రొడ్యూసర్ శ్రీనివాస్

3. చిన్న గ్రామంలో లేని సౌకర్యం ఏది?

అ) బ్యాంక్ ఆ) రైస్ మిల్ ఇ) పోస్టాఫీస్ ఈ) సినీమాహాల్

4. తెలంగాణలో కవులు లేరు అన్నందుకు తయారైన పుస్తకం ఏమిటి?

అ) కళాకారుల సంచిక   ఆ) శాస్త్రవేత్తల సంచిక  ఇ) వైద్య సంచిక  ఈ) కవుల సంచిక

5. డాక్టర్ కె. శ్రీనివాస్ ఏ దినపత్రికకు ఎడిటర్?

అ) జ్యోతి    ఆ) ఆంధ్రజ్యోతి  ఇ) దివ్య జ్యోతి  ఈ)ఈనాడు

ఆంధ్రజ్యోతి ఎడిటర్  కె.శ్రీనివాస్  గారు రాసిన తెలంగాణ సాహిత్య వికాసం చివరి పేజి నుండి  సేకరణ

---

*Interactive Exercise-5*

*An interactive H5P element has been excluded from this version of the text. You can view it online here:*
*https://pressbooks.justwrite.in/telugugadyaamsaalu/?p=103#h5p-5*

# 6. అపరిచిత గద్యం-6

జీవితాన్ని ఉద్యమమయంగా, ఆలోచనను చైతన్యవంతముగా మలుచుకుని సమాజంలో స్ఫూర్తి నింపేందుకు అహర్నిశలు తపించిపోయిన తెలంగాణ వైతాళికుడు వట్టికోట ఆళ్వారుస్వామి. ఈయన నల్లగొండ జిల్లా, నకిరేకల్ దగ్గరలోని, మాధవరం గ్రామంలో 1915 నవంబర్ 1న జన్మించాడు. తల్లిదండ్రులు సింహాద్రమ్మ , రామచంద్రాచార్యులు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన ఆళ్వారు స్వామి తెలిసిన వాళ్ళ ఇండ్లలో వండి పెడుతూ ,ఇంటి పనులు చేస్తూ, విద్యాభ్యాసం చేశాడు. బెజవాడ హోటల్లో సర్వర్ గా గోలకొండ పత్రికలో ప్రూఫ్ రీడర్ గా పనిచేస్తూనే సాహిత్య అభిరుచిని, లోకజ్ఞానాన్ని పెంచుకున్నాడు. ఆళ్వారు స్వామి గ్రంథాలయ ఉద్యమం ,ఆంధ్రోద్యమం, ఆంధ్ర మహాసభ, అరసం గుమస్తాల సంఘం, రైల్వే కార్మిక సంఘాలు మొదలైన సాహిత్య ,రాజకీయ ,ప్రజా ఉద్యమాల సంఘాలలో చురుగ్గా పాల్గొనేవాడు.కాళోజీ, వానమామలై వరదాచార్యులు, పద్య దాశరథి, గద్య దాశరథి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల, రావి నారాయణరెడ్డి మొదలైన తెలుగు ప్రాంతాలకు చెందిన ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. తెలంగాణ ప్రజలలో చైతన్యం పెంపొందించడానికి "దేశోద్ధారక గ్రంథమాల"ను స్థాపించి 33 పుస్తకాలను ప్రచురించారు. అనేక రకాల ఉద్యమాలలో పాల్గొని ఆళ్వారుస్వామి పలుమార్లు జైలుకు వెళ్లాడు. అలా జైలు లోపల తన తోటి ఖైదీ గాథలను వస్తువుగా తీసుకొని "జైలు లోపల" అనే కథల/ పుస్తకం రాశాడు. అందులో మొదటి కథ "పరిగె". అది తన తోటి ఖైదీ మల్లయ్య వెనుక ఉన్న విషాద గాథ. పేదవాడిలో నైతిక విలువలు నిర్బంధంలోనూ రక్తసంబంధాలను తలచుకుంటూ తపించిపోయే ఖైదీల హృదయం, జైలుకు రావడం వెనకున్న యధార్థాలను ఈ కథ మానవీయ కోణంలో చూపెడుతుంది. స్వామి రచించిన "ప్రజల మనిషి" నవల వారికి గొప్ప కీర్తిని తెచ్చి పెట్టింది.

ప్రశ్నలు:

1. ఆళ్వారు స్వామి స్థాపించిన సంస్థ ఏది ?
2. పరిగె కథలో ఉన్న విషాదం ఎవరిది ?
3. ఆళ్వారు స్వామి తల్లిదండ్రులు ఎవరు?
4. ఆళ్వారు స్వామి బెజవాడలో చేసిన ఉద్యోగం ఏమిటి?
5. తెలంగాణ వైతాళికుడు అని ఎవరిని పిలుస్తారు.

# 7. అపరిచిత గద్యం-7

వ్యాపారం చేసి వేల కోట్లు సంపాదించిన వాళ్లు ఆ సంపాదన మొత్తం వారసులకు పంచుతారు. తాము విలాసవంతమైన జీవితాలను అనుభవిస్తారు. శ్రీరామ్ గ్రూపు వ్యవస్థాపకుల్లో ఒకరైన త్యాగరాజన్ మాత్రం తాను సంపాదించిన దాదాపు ఆరు వేల రెండువందల కోట్ల సంపదను వారసులకు కాకుండా ఉద్యోగులకు పంచేశారు. ఆడంబరాలకు దూరంగా ఓ చిన్న గదిలో జీవిస్తున్న ఆ పెద్దమనిషి వ్యాపారవేత్తనని చెప్పుకోవడానికి కూడా ఇష్టపడరు. నూటికో, కోటికో ఒక్కరుగా ఉండే ఇటువంటి వ్యక్తుల జీవితం ఎందరికో స్ఫూర్తినిస్తుంది. త్యాగరాజన్ తమిళనాడులోని వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగారు. పేదరికం వల్ల ఆయన కుటుంబం ఎన్నో ఇబ్బందులు పడింది. పస్తులతో గడిపిన రోజులు, నిద్రలేని రాత్రులు త్యాగరాజన్ కు ఇంకా గుర్తే ఉంటుంది. పట్టుదలతో బాగా చదువుకున్న ఆయన మద్రాసులో డిగ్రీ చేశారు. తండ్రికి ఇష్టం లేకపోయినా కోల్కత్తాలోని ఇండియన్ స్టాటిస్టికల్ యూనివర్సిటీలో నెలకు నూటా ఇరవై అయిదు రూపాయల స్టయిఫండ్ ఇస్తారని అక్కడికి వెళ్లి పీజీలో చేరారు. 1961లో చదువు అయిపోయాక ఒక బీమా సంస్థలో మేనేజ్మెంట్ ట్రైనీగా చేరిన త్యాగరాజన్ ఇరవై ఏళ్ల పాటు అక్కడే పని చేశారు. ఆ సమయంలో బ్యాంకుల నుంచి లోన్లు పొందలేక ఇబ్బంది పడే పేదవారి బాధను ప్రత్యక్షంగా చూసిన ఆయన కమర్షియల్ ఫైనాన్స్ వ్యాపారం ప్రారంభించాలనుకున్నారు. అందుకే 2006 లో ఉద్యోగులే భాగ స్వాములు, యజమానులు గా ఉండే ఒక ట్రస్ట్ ను స్థాపించారు. సంస్థ నుంచి ఆ ట్రస్ట్ కు కొంత డబ్బును అందిస్తూ, పదవీ విరమణ సమయంలో వారికి అదనంగా డబ్బులు అందజేస్తుంటారు. అంతేకాకుండా త్యాగరాజన్ తన ఆరోగ్య అవసరాల కోసం ఓ నలభై లక్షల రూపాయలు ఉంచుకొని మిగతా ఆరువేల రెండు వందల కోట్ల రూపాయలని ఆ ట్రస్ట్ కి బదిలీ చేశారు. ఉద్యోగుల బాగోగుల గురించి ఆలోచించిన ఆ పెద్దమనిషి “హోదా అనేది సొంతంగా తెచ్చుకోవాలి కానీ వారసత్వంగా రాకూడదు” అని నమ్ముతారు. అందుకే తన పిల్లలకు శ్రీరామ్ గ్రూప్ యాజమాన్య బాధ్యతలను ఇవ్వలేదు. ఆయన పెద్ద కొడుకు ఇంజనీరుగా పనిచేస్తుంటే ,చిన్న కొడుకు సి.ఏ.గా ఆ సంస్థలోనే సాధారణ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఫోనును టైం వేస్ట్ గా భావించే ఆయన సమయం దొరికితే పుస్తకాలు చదువుతారు. శాస్త్రీయ సంగీతం వింటారు. ఈ మహా మనిషికి భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

1. త్యాగరాజన్ ఏ కుటుంబం లో పుట్టి పెరిగారు?
2. డబ్బున్న వారు తమ సంపాదన సహజంగా ఎవరికి పంచుతారు?
3. సమయం దొరికితే త్యాగరాజన్ చేసే పని ఏమిటి?
4. సి.ఏ. గా పని చేస్తున్నది ఎవరు?
5. త్యాగరాజన్ కు భారత ప్రభుత్వం ఇచ్చినది ?

# 8. అపరిచిత గద్యం-8

నెదర్లాండ్స్ చాలా చిన్న దేశం. అక్కడ లోతుగా ఉన్న ప్రాంతాలే ఎక్కువ. బురద నేలలు అధికంగా ఉన్న ప్రాంతం .అక్కడ వ్యవసాయం చేయడమే గొప్ప. పెద్ద పెద్ద గాలి పంకాలతో బురద నేలల్ని ఆరబెట్టుకుంటూ ఎంతో శ్రమతో వ్యవసాయం చేస్తారు. అయినా ఆ దేశం పంటలను తమ కోసమని సరిపెట్టుకోలేదు. పండుతున్న పంటలో చాలా భాగం ఎగుమతి చేస్తుంది. జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం, కెనడా, ఆఫ్రికా తదితర దేశాలకు టొమాటో, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు లాంటి కూరగాయలనే కాక, అలంకరణకు వాడే పువ్వులు, మొక్కలు, పాల ఉత్పత్తులు, గుడ్లు, మాంసము ఎగుమతి చేసి ఏటా లక్షల కోట్ల రూపాయలు సంపాదిస్తుంది. దాంతో ఎప్పుడూ వర్షాకాలంలా ఉండే ఈ చిన్న దేశం ఉన్నట్టుండి " సిలికాన్ వ్యాలీ ఆఫ్ అగ్రికల్చర్" లాగా తయారయింది. దేశాలన్నీ తమ అవసరాల కోసం పని చేస్తుంటే నెదర్లాండ్స్ మాత్రం కొన్ని దశాబ్దాలుగా ప్రపంచ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పని చేయడం మొదలుపెట్టింది. రెండు వేల యాభై సంవత్సరం నాటికి పెరిగే ప్రపంచ జనాభా ఆకలి తీరాలంటే ఇప్పటికన్నా ఇంకో యాభై ఆరు శాతం ఎక్కువ ఆహార పదార్థాలు కావాలి. అలాగని సాగుకి అందుబాటులో ఉన్న నేల పెరగదు. మరి దిగుబడి పెంచడం ఎలా? ఈ ప్రశ్నలను నెదర్లాండ్స్ వందేళ్ళ క్రితమే వేసుకుంది. రెండు ప్రపంచ యుద్ధాలు ఆదేశాన్ని అతలాకుతలం చేశాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత వచ్చిన కరువు వల్ల దాదాపు ఇరవై రెండు వేల మంది చనిపోయారు . మరోసారి అలాంటి కరువు రాకూడదని, ఆహార ఉత్పత్తిలో మిగులు సాధించాలని సంకల్పం చేసుకొని ఆ దేశం లక్ష్యసాధన దిశగా చేసిన కృషి ఇప్పుడు దాన్ని ప్రపంచ పటంలో సమున్నతంగా నిలబెట్టింది. ఈ అద్భుత మార్పు కోసం రైతులు, ప్రభుత్వము, వ్యవసాయ విశ్వవిద్యాలయాల పరిశోధకులు కలిసికట్టుగా కృషి చేశారు. ఈ మూడు విభాగాలను కలిపి అక్కడ "గోల్డెన్ ట్రయాంగిల్ "అని పిలుచుకుంటారు.

1. నెదర్లాండ్ లో వున్న భూములు ఏ రకానివి?
2. వర్షాలతో ఉండే భూమి కొద్ది రోజుల్లో ఎలా మారిపోయింది !
3. "గోల్డెన్ ట్రయాంగిల్" అంటే ఎవరు?
4. కరువు వల్ల చనిపోయింది ఎంత మంది?
5. పెరిగే జనాభాకు ఎంత శాతం ఆహారం అవసరం.

# 9. అపరిచిత గద్యం-9

గ్రామానికి మేలు చేయాలంటే చేతిలో అధికారం ఉండక్కర్లేదని, మంచి ఆలోచన ఉంటే చాలని నిరూపించారు రామ్ హర్. హర్యానాలో ఏమాత్రం అభివృద్ధి చెందని గ్రామాల్లో సిలానీ కేశో ఒకటి. కరెంటు లేక ఆ గ్రామం చాలా కాలం చీకట్లో ఉండిపోయింది. భారత సైన్యంలో పనిచేసి రిటైర్ అయ్యాక తాను పుట్టి పెరిగిన కేశో లోనే స్థిరపడ్డాడు రామ్ హర్. విద్యుత్తు సౌకర్యం కల్పించమంటూ అధికారులు చుట్టూ తిరిగాడు. తర్వాత గ్రామస్తులతో కలిసి ఎన్ని అభ్యర్థనలు సమర్పించినా ఎలాంటి స్పందన రాలేదు. దాదాపు అయిదు సంవత్సరాలు అనేక ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో రామ్ హర్ స్వయంగా రంగంలోకి దిగాడు. కోడి రెట్ట నుంచి కరెంటు తయారు చేయొచ్చని స్నేహితుల ద్వారా తెలుసుకున్నాడు. కోళ్ల వల్ల మాంసం, గుడ్డుతో పాటు ఈ ప్రయోజనం కూడా అదనంగా ఉండడంతో 20వేల కోళ్ళతో పౌల్ట్రీని ప్రారంభించాడు. కోళ్ల రెట్టలను సేకరించి ఒక ట్యాంకు లో నిల్వచేసి అందులోంచి వచ్చే మీథేన్ గ్యాస్ తో జనరేటర్ ను నడుపుతున్నాడు. దాంతో మొదట తన పౌల్ట్రీ ఫామ్ కి , ఇంటికి కరెంటు కనెక్షన్ ఇచ్చాడు. క్రమంగా కోళ్ల సంఖ్యను పెంచడంతోపాటు విద్యుత్ ఉత్పత్తిని రెట్టింపు చేసి గ్రామస్తులు ఇళ్లకు వెలుగులు పంచడం మొదలుపెట్టాడు. తమ గురించి పెద్ద మనసుతో ఆలోచించిన రామ్ హర్ కు గ్రామస్తులు తోడుగా నిలబడ్డారు. విద్యుత్తు తయారీకి అయ్యే ఖర్చును తాము కూడా పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రతినెలా కరెంటు బిల్లు రూపంలో కొంత డబ్బును రామ్ హర్ కు చెల్లిస్తుంటారు. కోడి రెట్టలతో కరెంటును తయారు చేయడం వల్ల ఆ ప్రాంతంలోని రైతులు తమ పౌల్ట్రీ లోని రెట్టల్ని సేకరించి అమ్మి అదనపు ఆదాయమూ పొందుతున్నారు. దాంతో పరిసరాలు శుభ్రంగా ఉంటున్నాయి అంటున్నారు గ్రామస్తులు. ప్రస్తుతం రామ్ హర్ కొడుకులు కూడా తండ్రి బాటలోనే నడుస్తున్నారు. ఇరుగుపొరుగు గ్రామాల్లోని కోడి రెట్టల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి స్థానికులకు వెలుగులు పంచే పనిలో పడ్డారు.

ప్రశ్నలు:

1. తన గ్రామానికి కరెంటు కోసం రామ్ హర్ ఎన్ని రోజులు ప్రయత్నించాడు.
2. కోడి రెట్ట నుండి కరెంటు తయారు తీయవచ్చని రామ్ హర్ కు చెప్పింది ఎవరు?
3. కోడి రెట్టలు నింపిన ట్యాంకు నుండి వచ్చే గ్యాస్ పేరు ఏమిటి?
4. రామ్ హర్ బాటలో నడుస్తున్నది ఎవరు?
5. పౌల్ట్రీ ఎన్ని కోళ్లతో ప్రారంభమైంది?

# 10. అపరిచిత గద్యం-10

ప్రాణాలను కాపాడేందుకు ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి శరీర భాగాలు అమరుస్తారు. ఒక్కోసారి పరిశోధనల కోసం కూడా ఒక వ్యక్తి నుంచి శరీర భాగాలను బయటకు తీస్తారు. బ్రతికి ఉన్నవారి నుంచి శరీర భాగాలను తీసి దానం చేయడం, చనిపోయిన వారి నుంచి శరీర భాగాలను వెలికి తీసి మరొకరికి మార్చడం ఈ రెండు పద్ధతులు ఉన్నాయి. అవయవ దానం ప్రక్రియ కుటుంబ సభ్యుల ఆమోదంతో నిజాయితీగా జరిగే ఒక ప్రక్రియ. ప్రపంచంలో తొలిసారిగా 1954లో అవయవ దానం చేసిన దాత "రోనాల్డ్ లీ హెరిక్ ". అతి వృద్ధ అవయవదాతగా స్కాట్లాండ్ దేశానికి చెందిన నూటా ఏడు సంవత్సరాల మహిళ తన కంటిలోని కార్నియాను దానం చేసి చరిత్రలో నిలిచారు. అవయవ దానాలు వ్యాపారంగా నిర్వహించడం చట్ట ప్రకారం నేరం. ఆగస్టు 13వ తేదీని అవయవ దాన దినోత్సవం గా ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈనాడు సమాజంలో అవయవ దానం పట్ల అవగాహన చాలా పెరిగింది. అనేక సందర్భాల్లో ప్రమాదాల్లో చనిపోయిన వ్యక్తుల యొక్క కళ్ళను, గుండెను దానం చేయడానికి కుటుంబ సభ్యులే ముందుకు రావడం దీనికి నిదర్శనం. గుండెను దానం చేసి ప్రాణం ఇవ్వ వచ్చు. కళ్ళను దానం చేసి, ఆ కళ్ళలో చనిపోయిన వ్యక్తిని చాలా కాలం మనం చూడవచ్చు. అందుకే ఈనాడు అన్ని దానాలలో అవయవ దానం చాలా గొప్పదిగా భావించబడుతుంది.

1. అవయవ దానం మొదటగా ఏ సంవత్సరం లో జరిగింది.
2. కార్నియాను దానం చేసిన మహిళ ఏ దేశానికి చెందినది.
3. ఆగస్టు 13 ప్రత్యేకత ఏమిటి?
4. చట్టం ప్రకారం నేరం ఏది?
5. అవయవ దానానికి ముందుకొచ్చే వారు ఎవరు?

# 11. అపరిచిత గద్యం-11

ఈ ప్రపంచంలో అనేక రకాల జంతువులు, పక్షులు ఉన్నాయి. వాటి ప్రత్యేకతల గురించి మనకు తెలియని విషయాలు కూడా చాలా ఉన్నాయి. ఆహారం, నీరు లేకుండా కొన్ని జీవులు నెలల తరబడి ఉండగలవు. తేనెటీగలు తమ శరీరాలపై ఒక తేనె గూడు తయారు చేసుకుని అందులో తేనెను నిలువ చేసుకుంటాయి. చలికాలంలో అది వాటికి ముఖ్యమైన ఆహారం. ఎందుకంటే ఆ కాలంలో తేనెటీగలకు నెలల తరబడి ఆహారం దొరకదు. అప్పుడు తమ శరీరంపై ఉన్న గూడులోని తేనెను ఉపయోగిస్తాయి. ఎడారి తాబేలు 50 నుండి 80 సంవత్సరాలు బతుకుతుంది. ఇవి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రత నుండి అరవై డిగ్రీల ఉష్ణోగ్రత మధ్యలో కూడా జీవించగలవు. ఇవి తమ మూత్రాశయం లోని నీటిని శక్తిగా మార్చుకొని నెలల తరబడి ఆహార అవసరాలు తీర్చుకుంటాయి. అడవుల్లో భయంకరంగా వేటాడే జీవుల్లో కొమోడో డ్రాగన్ ఒకటి. వాటి నోటి నుండి బయటకు వచ్చే లాలాజలంలో ప్రమాదకరమైన విషం దాగి ఉంటుంది. ఇది ఒక జింకను సగం మేకను కూడా ఒకేసారి మింగ గలదు. తర్వాత వారాలు, నెలల వరకు తిండి లేకుండా ఉండగలవు. నెమ్మదిగా జీర్ణం చేసుకోగల ప్రత్యేక శక్తి వీటికి ఉంది. ఇలా మనం తరచి తరచి పరిశీలిస్తే మనిషి విస్తు పోయే వింతలతో పాటు,కళలు కూడా సకల జీవులు బ్రతుకు విధానంలో దాగి ఉన్నాయి .ఒక చీమా , ఓ సాలీడు, గిజిగాడి గూడు ఇలా ఎన్నో మరెన్నో..

ప్రశ్నలు:

1. చలికాలంలో తేనెటీగలకు ముఖ్యమైన ఆహారం ఎక్కడ దొరుకుతుంది?
2. 50 నుండి 80 సంవత్సరాలు బతికే ఎడారి జీవి ఏది ?
3. “కొమోడో డ్రాగన్” లాలాజలం లో ఏముంటుంది.
4. తాబేలు దేనిని శక్తిగా మార్చుకొని నెలల తరబడి ఆహార అవసరాలు తీర్చుకుంటుంది.
5. ఒక జింకను, సగం మేకను ఒకేసారి మింగగల జీవి ఏది?

# 12. అపరిచిత గద్యం-12

పరీక్షలు పూర్తయి విద్యార్థులంతా " ఈ పాత పుస్తకాలను ఏం చేద్దాం అబ్బా" అని ఆలోచించే కాలం ఇది. అలాంటి వాళ్ళందరూ అవసరం లేని పుస్తకాలని తమకు ఇవ్వచ్చు అంటున్నాయి ఈ సంస్థలు. "అలీబాబా డాట్ కామ్" ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ- కామర్స్ సంస్థ. ఈ కంపెనీ 2016లో భారత్ లో అడుగుపెట్టిందే తడవుగా "మిషన్ మిలియన్ బుక్స్" అనే సేవా కార్యక్రమాన్ని ప్రారంభించింది. మన దగ్గరున్న పాత పుస్తకాలను సేకరించి అవసరమున్న నిరుపేద విద్యార్థులకు అందిస్తోంది. గత మూడేళ్లలో అంటే 2016 నుండి 2019 వరకు మూడు లక్షల పుస్తకాలను ఇలా సేకరించి రెండు వేల బడులకి అందించింది. వాటి ద్వారా లక్షల మంది నిరుపేద విద్యార్థుల్ని ఆదుకుంది. 2026 నాటికి 10 లక్షల పుస్తకాలని, పదివేల పాఠశాలలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకొని పుస్తకాలు సేకరిస్తుంది. ముంబైకి చెందిన సేవా సంస్థ 'రత్న నిధి" ట్రస్ట్ ఈ పుస్తకాలను వర్గీకరించి దేశవ్యాప్తంగా పంపిణీ చేస్తుంది. ఇక "బుక్ ఫర్ ఆల్' నిరుపేద చిన్నారులకు విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా పని చేస్తున్న సంస్థ. లండన్ ప్రధాన కార్యాలయంగా ఉన్న ఈ సంస్థ రెండేళ్ల కిందట భారత్ లో తన సేవలు మొదలు పెట్టింది. ఈ సంస్థ కూడా విజయవాడ, విశాఖపట్నం నుంచి పాత పుస్తకాలను తీసుకుంటుంది. వివరాలకి www.booksforall.co.in వెబ్ సైటు ను చూడవచ్చు.

ప్రశ్నలు:

1. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఈ కామర్ సంస్థ ఏది?
2. 2016లో భారత్ లో ప్రారంభమైన సేవా కార్యక్రమం ఏ పేరుతో ఉంది.
3. 2026 వరకు ఎన్ని పాఠశాలలకు పుస్తకాలను అందించాలనే లక్ష్యం మిషన్ మిలియన్ బుక్స్ పెట్టుకుంది.
4. పుస్తకాలను వర్గీకరించే ట్రస్ట్ ఏది ?
5. బుక్ ఫర్ ఆల్ సంస్థ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

# 13. అపరిచిత గద్యం-13

జీవితాన్ని తమ కోసం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం వాడిన మహనీయులు ఎందరో వున్నారు. అటువంటి వారిలో వనజీవి రామయ్య గా పేరు గడించిన దరిపల్లి రామయ్య ఒకరు. కోటికి పైగా మొక్కలను నాటి, పెంచడం వల్ల ఆయన వనజీవి రామయ్య గా పిలిపించుకున్నారు. ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వనజీవి రామయ్య ప్రతిభను గుర్తించి మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడ తొమ్మిదవ తరగతి తెలుగు విద్యార్థుల కోసం ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టిందంటే పర్యావరణాన్ని కాపాడడానికి రామయ్య చేసిన కృషిని గమనించవచ్చు. ఇతని స్వగ్రామం ముత్తుగూడెం. అక్కడే పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదువుకున్నాడు. ఆ సమయంలోనే ఉపాధ్యాయుడు మల్లేశం ప్రబోధించిన "మొక్కల పెంపకం- లాభాలు" అనే పాఠం అతనిలో స్ఫూర్తినింపింది. తన ఇంటిలోని నలభై కుంటల స్థలంలో చెట్లు నాటి వాటిని ప్రాణప్రదంగా పెంచాడు. అది మొదలు రోడ్ల పక్కన ఖాళీ స్థలం , ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ స్థలాలు, దేవాలయాలు ఇలా ఒకటేమిటి ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ మొక్కలు నాటడం రామయ్యకు రోజువారి పని అయింది. ఇతని వృత్తి కుండలు చేయడం, పాలు అమ్మడం. ప్రవృత్తి మాత్రం వన పెంపకానికి అవిశ్రాంతంగా కృషి చేయడం. ఇతడు తన మనుమళ్లు, మనమరాళ్లకు కూడా చెట్ల పేరే పెట్టారంటే చెట్లను పెంచడం పట్ల అతనికున్న ఆరాటం అర్థం అవుతుంది. ఒక మనుమరాలి పేరు చందన పుష్ప. ఇంకో మనమరాలి పేరు హరిత లావణ్య. కబంధ పుష్ప అని ఇంకో పాపకు పేరు పెట్టాడు. మరో మనవరాలికి వనస్థలి అని నామకరణం చేశాడు. ఏ సందర్భంలోనైనా తను బహుమతి ఇవ్వదలుచుకున్నా, తనకు బహుమతి ఇవ్వాలనుకున్న మొక్కలని ఇవ్వాలంటాడు. కోటికి పైగా మొక్కలను నాటి ఇంకా మొక్కలు నాటడం లోనే నిమగ్నమై ఉన్న వనజీవి రామయ్య కృషిని గమనించి మన భారత ప్రభుత్వం అతనిని పద్మశ్రీ బిరుదుతో సత్కరించింది. ఈ పురస్కారం రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతులమీదుగా రామయ్య అందుకున్నాడు. విద్యార్థినీ విద్యార్థులే కాదు ప్రతి ఒక్కరూ ఇటువంటి మంచి కార్యక్రమాలలో భాగం పంచుకుంటే అంతకంటే మంచి మార్పు ఇంకేముంటుంది.

ప్రశ్నలు.

1. ఎవరికైనా బహుమతి ఇస్తే రామయ్య ఇచ్చేది.
2. వన జీవి రామయ్య పాఠాన్ని తెలుగు పుస్తకంలో ప్రవేశ పెట్టిన ప్రభుత్వం.
3. మల్లేశం మాష్టారు వల్ల రామయ్య స్ఫూర్తి పొందిన పాఠం ఏది
4. పద్మశ్రీ అందించిన రాష్ట్రపతి పేరు.
5. రామయ్య ఇంటి స్థలం ఎంత?

# 14. అపరిచిత గద్యం-14

ఉజ్వల విప్లవాల ఉద్యమాలతో సంబంధం ఉన్న జమీందారు కూతురు. చిన్న వయసు నుండే విప్లవ ఆలోచనలు కలిగిన బాలిక. పర దేశీయుల రాక్షస పాలన గురించి ఆలోచించి పిడికిలి బిగించి కేక వేసింది. ఉజ్వల 1914లో జన్మించింది. 14 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు తండ్రి ఆమెను ఆయుధాలు చేరవేసే పనికి ఉపయోగించుకున్నాడు. ఉజ్వల తన మెట్రిక్యులేషన్ చదువు పూర్తి చేసుకున్న అనంతరం స్నేహితులను కలవాలి అనే వంకతో విప్లవ వీరులను చేరుకుంది. అక్కడున్న భవాని భట్టాచార్య, రవి బెనర్జీ, మనోరంజనులతో కలిసి డార్జిలింగ్ గవర్నర్ను రేసు కోర్టులో పేల్చివేసే ఎత్తుగడని వేసుకుంది. చివరికి ఆ గురి తప్పి చాకచక్యంగా పారిపోయింది. కానీ చివరకు పట్టుబడి జైలుకు వెళ్ళింది. విడుదలైన తర్వాత సుభాష్ చంద్రబోస్ సైన్య విభాగాన్ని నడపడంలో భాగం పంచుకొని ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతి కాలంలో సమాజ సేవ చేయడమే కాక "పాల్ నికేతనం" అనే ఒక సంస్థను నడిపింది. 1948లో పేరు పొందిన విప్లవకారుడైన భూపేంద్ర రక్షిత కిషోర్ ను వివాహమాడింది .ఒక బంతిని ఎంత బలంతో నేలకేసి కొడితే అంతే వేగంతో పైకి లేస్తుంది. ఉద్యమాల స్వభావం కూడా అటువంటిదే. ఉజ్వల జీవితం సరిగ్గా ఈ విషయానికి సరిపోతుంది.

ప్రశ్నలు:

1. ఉజ్వల విప్లవ సహచరులను ఎలా చేరుకుంది.
2. రేస్ కోర్టు లో చంపాలనుకున్నది ఎవరిని?
3. జైలు నుంచి విడుదలైన ఉజ్వల ఏ పనిలో భాగం పంచుకుంది.
4.పాల్ నికేతనం అనే సంస్థను నడిపింది ఎవరు?
5. తండ్రి తన బిడ్డను ఏ పనికి ఉపయోగించుకున్నాడు.

# 15. అపరిచిత గద్యం-15

రొట్టెలు కాల్చుకోవడానికి నూనె కూడా లేనంత పేదరికంతో,గుడిసెలో, గుడ్డి దీపపు వెలుగులో చదువుకుని దేశ ప్రథమ పౌరుడి స్థానానికి ఎదిగిన మహనీయుడు డాక్టర్ ఏ.పి.జె అబ్దుల్ కలాం. వారు మన దేశానికి 11 వ రాష్ట్రపతిగా, క్షిపణి శాస్త్రవేత్తగా ఎనలేని సేవలందించి చరితార్థుడయ్యారు. తమిళనాడులోని రామేశ్వరం లో పుట్టి పెరిగిన కలాం తన జీవిత విశేషాలను తెలుపుతూ ఇలా అన్నారు.నాకు అన్ని రకాల పుస్తకాలు చదవడం ఇష్టమైనప్పటికీ చాలా బాగా నచ్చిన పుస్తకాలు మూడు ఉన్నాయి .అందులో మొదటిది “లిల్లియన్ ఇష్టర్ వాట్సన్” సంకలనం చేసిన “లైట్ ఫ్రమ్ మెనీ లాంప్స్” ఈ పుస్తకం నేను 1953లో చెన్నైలో మూర్ మార్కెట్లో, పాత పుస్తకాల దుకాణంలో కొన్నాను.అప్పటి నుండి గత ఐదు శాబ్దాలుగా ఆ పుస్తకం నా ఆత్మీయ మిత్రుడిగా, సహచరుడుగా ఉంటూ వచ్చింది. నేను ఎంతో గౌరవించే మరొక పుస్తకం “తిరువళ్లు వర్” రచన తిరుక్కురల్. ప్రతి ఒక్కరికి చక్కని నడవడికను సూచించే రచన అది. ఇక మూడవ పుస్తకం నోబెల్ బహుమతి గ్రహీత అయిన డాక్టర్ “అలక్సీ కారేల్” రచించిన “మాన్ ద అన్నోన్”. మనం పిల్లలకి, విద్యార్థులకి తప్పనిసరిగా చెప్పవలసిన మాట ఒకటి ఉంది.అది రోజు కనీసం ఒక గంట సేపైనా పుస్తకాలు చదవండని చెప్పడం అంటారు కలాం. చదివిన వారు ఒక విజ్ఞాన నిధిగా మారిపోతారు అంటారు. మనం ఎవరికైనా కానుకలు ఇచ్చేటప్పుడు, ముఖ్యంగా పిల్లలకు కానుకలు ఇచ్చేటప్పుడు పుస్తకాలు బహూకరించడం అలవాటు చేసుకోవాలి అని చెప్పి, చేసిన వారు అబ్దుల్ కలాం. “నా ఈ ఎదుగుదలకు మా అమ్మగారే కారణం ” అంటూ తాను రాసిన “వింగ్స్ ఆఫ్ ఫైర్” పుస్తకంలో మాతృమూర్తికి కృతజ్ఞతలు తెలుపుకున్న మహనీయుడు కలాం.

ప్రశ్నలు:

1. అలెక్సీ కారెల్ అందుకున్న బహుమానం ఏది?
2. మూర్ మార్కెట్లో కలాం కొన్న పుస్తకం పేరు?
3. తిరువళ్ళువర్ రచించిన రచన ఏది?
4. మనం కానుకలుగా వేటిని ఇవ్వడం అలవాటు చేసుకోవాలి.
5. ” వింగ్స్ ఆఫ్ ఫైర్ ” రచయిత ఎవరు?

# 16. అపరిచిత గద్యం-16

అనేక ప్రాణులు ఏ విధముగా వివిధ ఆకారాలతో ప్రత్యేకతలను కలిగి ఉన్నాయో, చెట్లు కూడా అదేవిధంగా వింత వింత ఆకారాలు దాల్చి చిత్ర విచిత్రమైన ప్రత్యేకతలను కలిగి ఉన్నాయి.కొన్ని చెట్లు నడుము వాల్చి పడుకున్నట్లు ఉంటాయి. మరి కొన్నిసార్లు కూర్చున్నట్లుగా , ఇంకొకసారి పొర్లుచున్నట్లుగా కనపడుతూ వంకరలు తిరిగి ఉండటం విశేషం. ఇటువంటి విచిత్రమైన మొక్క మా తోటలో ఒకటి ఉందని మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. దాని పేరు "గోరీ ఒపాసియో వర్చా". ఈ రకములో ఐదు మొక్కలను వేయగా ఒక నాలుగు మాత్రమే నాటుకున్నాయి. ఇప్పుడు ఈ చెట్లు పూలు కూడా పూస్తున్నాయి. ఈ పూలను చూడడానికి ఒక పది రోజుల కాలము పడుతుంది. పూలు ఏ విధంగా క్రమక్రమంగా పూస్తాయో ,అదేవిధంగా క్రమక్రమంగా పది రోజులలో వాడిపోతాయి. ఇవి వికసించే పది రోజులు చూడడానికి ఎంతో ముచ్చటగానూ, రంగులు ఆశ్చర్యంగానూ కనిపిస్తాయి. మొగ్గలు వేసినప్పుడు ఈ పూల రంగు పసుపు పచ్చ. మొగ్గలు కొద్దిగా విచ్చుకునే సమయానికి పూర్తిగా పసుపు రంగు. కొన్ని రోజుల్లోనే వీటిలో ఎరుపు రంగు కనిపిస్తుంది. క్రమక్రమంగా పసుపు రంగు పూర్తిగా పోయి పూలు ఎర్రగా ఎంతో అందంగా వికసించి మనసును ఆకర్షిస్తాయి. ఇటువంటి పువ్వు మనదేశంలోమాత్రమే ఉందనే పేరు ఉంది.

ప్రశ్నలు:

1. విచిత్రమైన మొక్క మా తోటలో ఒకటి ఉంది అని అన్నది ఎవరు?
2. పువ్వులు వాడి పోవడానికి ఎన్ని రోజులు పడుతుంది.
3. పూర్తిగా పసుపు రంగు పూలకు ఎప్పుడు వస్తుంది.
4. పై గవ్య భాగములో ఉన్న మొక్క పేరు ఏమిటి ?
5. వంకర తిరిగి ఉన్న మొక్క చూడటానికి ఎలా కనపడుతుంది.

# 17. అపరిచిత గద్యం-17

మానవుడు జంతువులను మచ్చిక చేసుకోవడం నాగరికత మారుతున్న క్రమంలో ఒక ముందడుగు. మన ముందు తరాల్లో వన్యప్రాణులను కూడా మచ్చిక చేసుకునేవారు. అయితే నేడు ఈ స్థితిలో మార్పు వచ్చింది. ఏ జంతువును అంటే ఆ జంతువును మచ్చిక చేసుకోవడానికి వీలు లేదు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం నిర్దేశించిన జంతువులనే పెంచుకోవాలి. క్షీరదాలు, ఒంటెలు, పిల్లులు, కుక్కలు, గాడిదలు, గుర్రాలు, పందులు, గొర్రెలు, మేకలు, తదితరాలు ఈ జాబితాలో ఉన్నాయి. కరోనా, జీవిత గమనాన్ని పూర్తిగా మార్చింది. ఆ మహమ్మారి తెచ్చిన మార్పుల్లో పెంపుడు జంతువులని పెంచుకోవడం కూడా ఒకటి. లాక్ డౌన్ అనేది అందరి దృష్టి పెంపుడు జంతువుల పై పడేలా చేసింది. అందుకే కరోనా సమయంలో ఎప్పుడూ లేనంత డిమాండ్ పెట్స్ కి ఏర్పడింది. అదే క్రమంగా విదేశీ పెంపుడు జంతువులపై ఆసక్తి పెరిగేలా చేసింది. హైదరాబాదు, విశాఖపట్నం , విజయవాడ తదితర నగరాలలో కూడా “ఎగ్జోటిక్ పెట్స్” షాపులు దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు విదేశాల నుంచే పెట్స్ ప్రభుత్వ అనుమతితో రవాణా చేసుకునేవారు. దేశవ్యాప్తంగా ఎగ్జోటిక్ పెట్స్ కి డిమాండ్ పెరగడంతో అహ్మదాబాద్ , పూనే, ముంబై తదితర నగరాలలో బ్రీడింగ్ కేంద్రాలు వెలిశాయి. వీటిలో అనేక రకాల విదేశీ పక్షులు, జంతువులను పెంచుతున్నారు.మన దేశానికి చెందిన పక్షులను పెంచుకోవడం వైల్డ్ లైఫ్ చట్టం ప్రకారం నేరం. కానీ విదేశీ పక్షుల దిగుమతి, పెంపకం, వృద్ధికి ఈ చట్టం అనుమతిస్తుంది. పెట్స్ అనగానే చాలామందికి శునకాలే గుర్తుకొస్తాయి. కానీ ఇప్పుడు పిల్లులను పెంపుడు జంతువులు గా పెంచుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. నీటి తొట్టెల్లో వయ్యారంగా జలకాలాడే రంగురంగుల చేపల్ని పెంచడం కూడా ఇంటిల్లిపాదికి ఎంతో కాలక్షేపాన్ని కలిగిస్తుంది. ఫ్లాబెల్లా జాతి గుర్రాలు కూడా నేడు పెంపుడు జంతువులుగా ఇళ్లలో కనిపిస్తున్నాయి.

ప్రశ్నలు

1. ఏ చట్టానికి లోబడి మనం జంతువులను పెంచుకోవాలి.
2. మన దేశానికి చెందిన పక్షులను పెంచుకోవడం నేరం. దీనికి కారణమైన చట్టం ఏది?
3. ఇప్పుడు నగరాలలో దర్శనమిస్తున్న షాపులు ఏవి?
4. ఏ జాతి గుర్రాలు నేడు పెంపుడు జంతువులయ్యాయి.
5. ఇటీవల కాలంలో ఎవరి సంఖ్య బాగా పెరిగింది.

# 18. అపరిచిత గద్యం-18

మానవుడు ఇతర ప్రాణుల కంటే గొప్పవాడు, భిన్నమైన వాడు కావడానికి బుద్ధి, ప్రజ్ఞ, భాష ముఖ్య కారణాలుగా చెప్పవచ్చు. మనసులో ఉన్న అభిప్రాయాలను ఇతరులకు చెప్పడానికి ఉపయోగపడే అర్థవంతమైన ధ్వని రూపమే భాష. ప్రపంచంలో ఇప్పుడు దాదాపు 3500 భాషలు ఉన్నాయి. భాష మానవుడికి గొప్ప ఆయుధమే కాదు అది విలువ కట్టలేని సంపద. దీనిద్వారా అభిప్రాయ ప్రకటన చేసి అనుకున్న పనిని సాధించవచ్చు.దీని వలన కోపము , బాధ, ప్రేమ, వినయములను సులువుగా తెలుపవచ్చు. మాట స్నేహాన్నే కాకుండా శత్రుత్వమును కూడా కలిగించును. కావున ఆచితూచి మాట్లాడడం మంచిది. అందమైన కవితలు అల్లి తమ ప్రజ్ఞను భావితరాలకు పుస్తక రూపంలో అందించుటకు భాష సహకరించును.ప్రతి భాషలో ఒక సొగసు , ఒక ఒడుపు , ఒక గొప్పతనం ఇమిడి ఉంటుంది. పుట్టినప్పటి నుండి ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను తప్పక నేర్చుకోవాలి. సంస్కృతి , సంస్కారం ఇతర విలువలు నేర్చుకొని మనిషిగా ఎదగాలంటే మాతృభాష తప్పనిసరి అవసరం. విద్య , వైజ్ఞాన, సామాజిక అవసరాల కోసం తర్వాత ఇతర భాషలు నేర్చుకోవాలి.మాతృభాష చక్కగా నేర్చుకుంటే ఎన్ని భాషలైనా సులువుగా నేర్చుకోవచ్చు. కీర్తిశేషులు సునీత్ కుమార్ చటర్జీ, ఆచార్య వినోబాభావే ,పీవీ నరసింహారావు , సరస్వతీపుత్రుడు పుట్టపర్తి నారాయణాచార్యులు మొదలైన మహనీయులు మాతృభాష బాగా నేర్చుకున్న తర్వాతే అనేక భాషల్లో పండితులయ్యారు. అటువంటి వారే జాతికి మణిపూసలు.

ప్రశ్నలు:

1. మనిషి ఆచితూచి ఎందుకు మాట్లాడాలి.
2. ఇతర ప్రాణుల కంటే మనిషి ఎందుకు గొప్పవాడు.
3. మాతృభాషతో పాటు ఇతర భాషలు ఎందుకు నేర్చుకోవాలి.
4. మనిషిగా ఎదగడానికి కావలసినవి ఏవి?
5. సరస్వతీ పుత్రుడు ఎవరు?

# 19. అపరిచిత గద్యం-19

తెలంగాణ రాజకీయ, సాంఘిక, చైతన్యం అంటే వెంటనే గుర్తుకు వచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి. మనకు దూరదృష్టి కలిగిన చరిత్రకారులు బహు తక్కువ. అటువంటి వారిలో ముఖ్యంగా మన తెలుగువారిలో ప్రముఖ చరిత్రకారుడు, కవి, విమర్శకుడు, సంఘసంస్కర్త సంపాదకుడు అయిన సురవరం ప్రతాపరెడ్డి గురించి ఈనాటి విద్యార్థులు అందరూ తెలుసుకోవాలి. ఆయన హిందువుల పండుగలు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనే పరిశోధనాత్మక గ్రంథాలు రచించి ఈ తరం వారికి ఎంతో మేలు చేశారు. అంతే కాదు గోలకొండ పత్రిక సంపాదకుడుగా, గ్రంథాలయ ఉద్యమానికి తెలంగాణలో నాయకుడిగా సాహితీ సేవకుడిగా ప్రతాపరెడ్డి చేసిన సేవలు ప్రశంసనీయమైనవి. తండ్రి నారాయణరెడ్డి ప్రతాపరెడ్డికి మొదటి గురువు. చక్కని దస్తూరి, చదువు మీద భక్తి, భవిష్యత్తుపై ఆచంచల విశ్వాసం , సూక్ష్మ గ్రహణ శక్తి ప్రతాపరెడ్డికి తండ్రి నుండి అలవడినవి. 1924లో రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి గారు ప్రతాపరెడ్డి ఆహ్వానించి గోలకొండ పత్రికకు ఎడిటర్ గా నియమించారు. అతి తక్కువ సమయంలోనే ఆ పత్రిక సాంఘిక , సాంస్కృతిక, రాజకీయ రంగాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. ప్రతాపరెడ్డి అనేక కలం పేర్లతో వ్యాసాలు రాశారు.భావకవి, రామమూర్తి గద్వాల సిద్ధాంతి, వెర్రి వెంగళప్ప, చిత్రగుప్త సంగ్రామ సింహ, యుగవతి అనే పేర్లతో మూడు వేలకు పైగా వ్యాసాలు రాశారు సురవరం ప్రతాపరెడ్డి గారి వ్యాసాలు ఆనాటి తెలంగాణను పరిపాలించిన నవాబుకు నిద్ర లేకుండా చేసేవి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రశ్నలు..

1. ఎవరి ఆహ్వానం వల్ల సురవరం గోలకొండ పత్రిక ఎడిటర్ అయ్యారు.
2. గ్రంథాలయోధ్యమానికి నాయకుడు ఎవరు?
3. ఈ క్రింది వాటిలో సురవరం కలం పేరు ఏది?
4. సురవరం రాసిన చరిత్ర పుస్తకం ఏది?
5. సంఘ సంస్కర్త అంటే అర్థం ఏంటి?

# 20. అపరిచిత గద్యం-20

సిరి ధాన్యాల ఆవశ్యకతను గురించి ప్రపంచానికి తెలిపి, ఆరోగ్యం విషయంలో ఆ ధాన్యాల అవసరం ఎంత ఉందో గత 20 ఏళ్లుగా ప్రచారం చేస్తున్న వ్యక్తి ఖాదర్ వలి. వీరు ఒక స్వతంత్ర శాస్త్రవేత్త, ఆహార, ఆరోగ్య నిపుణులు, హోమియో వైద్యులు. "మిల్లెట్ మ్యాన్" అనే పేరుతో అందరికీ తెలిసిన వారు. సామలు, అరికెలు, కొర్రలు, అండు కొర్రలు, ఊదలు ఈ ఐదు సిరి ధాన్యాలను వెలికి తీసి, వాటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి తెలిపి, ఆహారంలో చేర్చి అందరికీ ఆరోగ్యాన్ని అందిస్తున్న మహనీయులు ఖాదర్ వలి. ఇతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా, ప్రొద్దుటూరులో హుస్సేనమ్మ, హుస్సేనప్ప దంపతులకు జన్మించారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో స్టెరాయిడ్స్ ను అంశంగా తీసుకొని పీ.హెచ్.డి. ని పూర్తి చేశారు. బెవెర్టన్ ఓరెగన్ లో పర్యావరణ శాస్త్రం పై పోస్టు డాక్టర్ ఫెలో గాను, సి.ఎఫ్.టి ఆర్. ఐ.లో శాస్త్రవేత్తగాను, మూడు సంవత్సరాలు పనిచేశారు. అమెరికాలోని "డ్యూపాండ్" అనే కంపెనీలో నాలుగున్నర సంవత్సరాలు పనిచేశాడు. మనం తినే తిండి కూడా విషతుల్యం అవుతుండడం గమనించి, ఆహారం కూడా వ్యాపారం కావద్దని, తాను పరాయి దేశంలో ఉద్యోగం చేయకుండా స్వదేశంలో ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేస్తున్నారు. 1997లో భారతదేశానికి తిరిగి వచ్చి మైసూర్లో స్థిరపడ్డారు. అంతరించిపోతున్న పై ఐదు సిరి ధాన్యాలను వాడడం వల్ల భయంకరమైన జబ్బులు కూడా తగ్గుతాయని కనుగొన్నారు. అందుకే ఆ ఐదు ధాన్యాలకు "సిరి ధాన్యాలు" అని పేరు పెట్టారు. అంతేకాక పండించే రైతులకు అవి సిరులను అందించే ధాన్యాలని ఖాదర్ వలీ తెలిపారు. వ్యవసాయ శాస్త్రానికి చేసిన సేవలకు గాను 2023లో పద్మశ్రీ పురస్కారం లభించింది. భారత మాజీ రాష్ట్రపతి రామనాథ కోవిద్ ఈ పురస్కారాన్ని అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (సి.పి.ఐ) తమ 2024 వార్షిక పురస్కారాల ప్రధాన ఉత్సవం సందర్భంగా "బ్రిక్స్ సిపిఐ సుస్థిర వ్యవసాయ మార్గదర్శి జీవన సాఫల్య" పురస్కారాన్ని మాజీ రాష్ట్రపతి రామనాద్ కోవిద్ చేతుల మీదుగా వీరికి అందించారు. మనిషి ఏది సాధించాలన్న ఆరోగ్యం ప్రధానం. అటువంటి ఆరోగ్యాన్ని అందించే ఆహార పరిశోధనలు చేసి మానవాళికి మేలు చేస్తున్న ఖాదరవలి నిజంగా ప్రాతఃస్మరణీయులు.

ప్రశ్నలు:

1. ఖాదర్ వలి నాలుగున్నర సంవత్సరాలు పనిచేసిన కంపెనీ ఏది?
2. సి.పి.ఐ. అంటే ఏమిటి?
3. 2023 లో ఖాదర్ వలి కి పద్మశ్రీ రావడానికి కారణం ?
4. ఖాదర్ వలి ఏ పేరుతో అందరికీ పరిచయం ?
5. ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎక్కడ ఉంది?

# 21. అపరిచిత గద్యం- 21

మదనపల్లిలోని బీసెంట్ థియోసాఫికల్ కాలేజ్‌ని 1919లో ఠాగూర్ సందర్శించాడు. ఆ కాలేజీలో ఉన్నప్పుడు జన గణ మన గీతాన్ని 'మార్నింగ్ స్టార్ ఆఫ్ ఇండియా పేరుతో అనువదించాడు.కాగా, జాతీయ గీతం పూర్తిగా 52 సెకండ్ల కాలవ్యవధిలో ఆలపించాలి. జాతీయ గీతాన్ని ఈ కింది ప్రభుత్వ కార్యక్రమాలలో, వివిధ సందర్భాలలో పూర్తిగా వినిపించాలి. సివిల్, మిలటరీ ఇన్ స్టిట్యూట్స్, రాష్ట్రపతి, గవర్నర్ కు గౌరవవందనం సందర్భాల్లో ఆలపించాలి. అలాగే రాష్ట్రపతి, గవర్నర్ వంటి ప్రముఖులు లేకున్నప్పటికీ పరేడ్ లలో ఆలపిస్తారు. రాష్ట్రప్రభుత్వ అధికార కార్యక్రమాలకు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు, ప్రజా సందోహ కార్యక్రమాలకు రాష్ట్రపతి వచ్చినప్పుడు, వెళ్తున్నప్పుడు, ఆకాశవాణిలో రాష్ట్రపతి జాతినుద్దేశించి చేసే ప్రంగానికి ముందు, వెనుక ఆలపిస్తారు.రాష్ట్ర గవర్నర్ తన రాష్ట్ర పరిధిలో అధికారిక కార్యక్రమాలకు వచ్చినప్పుడు, నిష్క్రమించేటప్పుడు,జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. రెజిమెంటల్ కలర్స్ బహుకరించినప్పుడు, నౌకాదళంలో కలర్స్ ఆవిష్కరించినప్పుడు ఈ గీతాన్ని ఆలపిస్తారు. కొన్ని సందర్భాల్లో జాతీయ గీతాన్ని సంక్షిప్తంగా మొదటి, చివరి వరుసలను ఆలపించుకోవచ్చు. అలా ఆలపించడం 52 సెకండ్ల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది. 1947లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో జాతీయ గీతం గురించి భారత ప్రతినిధి బృందాన్ని అడిగినప్పుడు జన గణ మన రికార్డింగ్‌ను జనరల్ అసెంబ్లీకి అందించారు. ఆ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతినిధుల ముందు జాతీయగీతాన్ని ఆలపించారు. అయితే మన జాతీయ గీతాన్ని అన్ని దేశాలు ప్రశంసించారు. మూడు సంవత్సరాల తర్వాత అంటే 1950 జనవరి 24న భారత రాజ్యాంగంపై సంతకం చేయడానికి అసెంబ్లీ సమాశమైంది. ఈ సమయంలో దేశ మొదటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ అధికారికంగా జన గణ మన ను జాతీయ గీతంగా ప్రకటించారు. ఈ నాడు ప్రతి విద్యార్థినీ విద్యార్థులు, పెద్దలు అందరూ తప్పక జాతీయ గీత అర్థమును తెలుసుకొని గౌరవ భావాన్ని పెంచుకోవాల్సిన అవసరం వుంది.

ప్రశ్నలు

1. జన గణ మన రికార్డింగ్ ను మొదట ఎక్కడ అందించారు.
2. మన జాతీయ గీతాన్ని అధికారికంగా ప్రకటించింది ఎవరు?
3. ఠాగూర్ జన గణ మనను ఎక్కడివచ్చినప్పుడు అనువదించారు.
4. భారత రాజ్యాంగంపై సంతకం చేయడానికి అసెంబ్లీ ఏ రోజున సమావేశం అయింది.
5. ఈ క్రింది సందర్భాలలో జాతీయ గీతాన్ని ఎప్పుడు ఆలపిస్తారు.

# 22. అపరిచిత గద్యం-22

మన దేశ స్వాతంత్ర్య పోరాటంలోకి అడుగుపెట్టిన విప్లవకారులలో మొట్టమొదటి వారు చాపేకార్ సోదరులు. అది పద్దెనిమిది వందల తొంబై ఏడు పూనాలో జరిగింది. ఆనాడు పూనా పట్టణంలో ఎక్కడ చూసినా ప్లేగ్ వ్యాధి వ్యాపించి ఉంది. రాండ్ అనే వ్యక్తి ప్లేగు కమీషనర్ గా నియమించబడ్డాడు. అతడు క్రూరుడే గాక అతి నిరంకుశుడు కూడా. ప్లేగు వ్యాధి వ్యాపించిన గ్రామాలన్నీ విధిగా ఖాళీ చేయాలని అతడు ఆర్డర్ జారీ చేశాడు. అయితే ఆ ఆర్డర్ కు సంబంధించినంతవరకు అతని తప్పులేదు. కానీ దాన్ని అమలు జరిపిన తీరు వలన ఆయన ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తిని కొని తెచ్చుకున్నాడు. అలాంటి గ్రామాల నుండి ప్రజలంతా అక్షరాల గెంటివేయబడ్డారు. తమ గుడ్డలను, పంట సామాగ్రి వగైరాలను సైతం సర్దుకుని తీసుకొని వెళ్లడానికి వారికి అవకాశం ఇవ్వలేదు. లోకమాన్య తిలక్ 1897 మే 4 వ తేదీన తన పత్రిక కేసరిలో ఒక వ్యాసం రాశాడు. ఆ వ్యాసంలో రాండ్ క్రూరుడు అని వర్ణించి నిర్బంధ విధానాన్ని అనుసరిస్తున్న ప్రభుత్వ ధోరణిని తప్పుపట్టాడు. అప్పుడే శివాజీ ఉత్సవాలు కూడా ప్రారంభమయ్యాయి. ఆ సందర్భంగా 1897 జూన్ 12వ తేదీన జరిగిన ఒక బహిరంగ సభలో తిలక్ ప్రారంభ ఉపన్యాసం చేశాడు. ఆ ఉపన్యాసంలో తిలక్ మాట్లాడుతూ "దొంగలు మన ఇంటిలో ప్రవేశించినప్పుడు వారిని తరిమివేయడానికి మన వద్ద తగిన శక్తి లేనప్పుడు ఎలాంటి సంకోచం లేకుండా వారిని ఇంటిలోనే ఉంచి ఇంటికి నిప్పంటించి సజీవ దహనం చేయడంలో తప్పులేదు " అనే స్ఫూర్తిదాయకమైన మాటలు మాట్లాడాడు. జూన్ 22 వ తేదీన చాపేకార్ సోదరులు రాండ్ ను , ఎవరెస్ట్ ను చంపేశారు. చాపేకార్ సోదరులు చేసిన ఈ పనికి రాండ్ నిరంకుశత్వం తో పాటు, తిలక్ ప్రసంగం కూడా కారణం అనే విషయం ఆరోజు అందరూ అనుకున్నారు. ఈనాడు జరుపుకుంటున్న గణపతి ఉత్సవాలు కూడా బ్రిటిష్ కు వ్యతిరేకంగా భారతీయులందరూ సమావేశం కావాలనే ఉద్దేశంతో తిలక్ ప్రారంభించినవే. గణపతి సామూహిక ఉత్సవాలను తిలక్ మొట్టమొదటగా పూనాలో ప్రారంభించాడు.

ప్రశ్నలు.

1. చాపే కార్ విప్లవ వీరులు ఏ సంవత్సరంలో స్వాతంత్ర పోరాటంలోకి అడుగుపెట్టారు.
2. ప్లేగు వ్యాధి కమిషనర్ గా నియమించబడిన వ్యక్తి ఎవరు?
3. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ నడిపిన పత్రిక పేరు ఏమిటి?
4. తిలక్ మాట్లాడిన బహిరంగ సభ ఏ సందర్భంగా ఏర్పాటు చేయడం జరిగింది.
5. జూన్ 22వ తేదీన జరిగిన సంఘటన ఏమిటి?

# 23. అపరిచిత గద్యం-23

తెలంగాణ రాష్ట్రంలో వనజీవి రామయ్య వలె కర్ణాటకలో పేరు ప్రఖ్యాతులు పొందిన పర్యావరణవేత్త సాలు మరద తిమ్మక్క. ఈమె హులికుల్ నుండి , కుడుర్ వరకు ఉన్న జాతీయ రహదారి పక్కన నాలుగు కిలోమీటర్ల మేర 384 మర్రి చెట్లు పెంచడం ద్వారా జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందారు. తిమ్మక్క బెంగుళూరు రూరల్ జిల్లా అయిన రామనగర్ లోని హులికుల్ గ్రామానికి చెందినది. "సాలుమరద" అంటే కన్నడ భాషలో వృక్షాల వరుస అని అర్థం. తిమ్మక్క భర్త పేరు చిక్కయ్య. భార్య నాటే చెట్లకు నీళ్లు పోసి పెంచడం కోసం ఆయన తన ఉద్యోగాన్ని కూడా వదిలిపెట్టాడు. వీరికి పిల్లలు లేకపోవడంతో ఉమేష్ అనే అబ్బాయిని దత్తత తీసుకున్నారు. సమాజానికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్టేనని నమ్మి మొక్కలు నాటడం మొదలుపెట్టారు. ఆ మొక్కలను సొంత బిడ్డల్లా ప్రేమించి, జాగ్రత్తగా పెంచి కాపాడారు. "చెట్లే కదా నా పిల్లలు" అని చెబుతుంటారు తిమ్మక్క.అమెరికాలోని లాస్ ఎంజిల్స్, ఓక్లాండ్, కాలిఫోర్నియాలలో స్థాపించిన పర్యావరణ సంస్థలకు ఆమె పేరు మీద "తిమ్మక్క రిసోర్సెస్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్" అని పేరు పెట్టారంటే ఈవిడ గొప్పతనం మనం అర్థం చేసుకోవచ్చు. చదువు లేకపోయినా వేలిముద్ర వేస్తారు. ఏదైనా సేవ చేయాలంటే చదువు అవసరం లేదు, చేయాలన్న ఆలోచన ఉంటే చాలు అని చెప్తుంటారు తిమ్మక్క. పర్యావరణానికి చేసిన కృషికి గుర్తింపుగా ప్రభుత్వం భారత జాతీయ పౌర పురస్కారంతో సాలుమరద తిమ్మక్కను గౌరవించింది. మంచి గుణాలు ఉన్న వారిగా, సంస్కారవంతులుగా, సమాజ సేవకులుగా తయారు కావడం అనేది పుస్తకాలలో ఉండే చదువు కాదనీ, మంచి మనసు , ఆలోచన ఉంటే పదిమందికి ఉపయోగపడే పని చేయవచ్చని సాలు మరద తిమ్మక్క జీవితం మనకు నేర్పుతుంది. ఈ విషయం, చదువుకునే విద్యార్థులే కాక, పెద్దలు కూడా గమనిస్తే మార్పు సులభం.

ప్రశ్నలు:

1. సాలు మరద అంటే కన్నడ భాషలో వున్న అర్థం ?
2. తిమ్మక్క జాతీయ రహదారి పక్కన నాటిన చెట్లు.
3. ఉద్యోగాన్ని వదిలి చెట్లను పెంచింది ఎవరు?
4. తిమ్మక్క దంపతులు పెంచుకున్న అబ్బాయి ?
5. అమెరికా వారు తమ పర్యావరణ సంస్థలకు పెట్టిన పేరు?

# 24. అపరిచిత గద్యం-24

భారతదేశ ప్రథమ మహిళ ఐ.పీ.ఎస్.( ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారిణిగా “కిరణ్ బేడీ” అనేక పదవులు చేపట్టారు. 1972 బ్యాచ్ కు చెందిన ఈమె చిన్న వయస్సులోనే మంచి క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. అఖిల భారత టెన్నిస్ టైటిల్ ను , ఏషియన్ టెన్నిస్ టైటిల్ ను గెలుపొందింది. 1973 జనవరి 26న జరిగిన రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా మొట్టమొదటి మహిళా ఐ.పీ.ఎస్. అయిన బెడీ ని చూసి ప్రజలు ఆనందానికి , ఆశ్చర్యానికి గురయ్యారు. ఇండియన్ పోలీస్ సర్వీసులో భాగంగా ఆమె తన జీవితంలో న్యూఢిల్లీ ట్రాఫిక్ చీఫ్ గా, మిజోరాం డీ.ఐ.జీ.గా, చండీగఢ్ లెఫ్టినెంట్ గవర్నర కు సలహాదారుగా, మాదకద్రవ్య వస్తువుల నియంత్రణ శాఖ సర్వోన్నత అధికారిగా పేరు గడిచింది. అంతేకాక రచయిత్రిగా పేరు తెచ్చుకొని “ఐ డేర్ ఇట్స్ ఆల్వేస్ పాజిబుల్” అనే పేరుతో ఆత్మకథలు రాసింది. 1987 లో నవజ్యోతి, 1994లో ఇండియా విజన్ అనే సంస్థలు స్థాపించి దేశానికి సేవ చేసింది. 1982లో ప్రధాని ఇందిరాగాంధీ కారు అనుమతి లేని చోట నిలిపి ఉంచారని క్రెన్ తో దాన్ని తొలగించిన కర్తవ్య ధీశాలి ఆమె. ఆనాటి నుండి ప్రజలు ఆమెను “క్రేన్ బేడీ” అని ప్రేమగా పిలిచేవారు. పురుషులైనా, స్త్రీలైనా మానసిక బలంలో సమానులని నిరూపించిన వ్యక్తి కిరణ్ బేడి .భారతదేశపు మొట్టమొదటి మహిళా ఐ.పీ.ఎస్. అధికారిణిగా గుర్తింపు పొందిన బేడి రామన్ 1994 లో రామన్ మెగాసెసే అవార్డును, 2004 లో యునైటెడ్ నేషన్స్ మెడల్ ను, 1979లో ప్రెసిడెంట్ గ్యాలరీ అవార్డును సొంతం చేసుకొని స్త్రీ శక్తిని నిరూపించింది. ఇలా ఎందరో భారతీయ మహిళలకే కాకుండా ప్రపంచ మహిళలకు కూడా ఆదర్శప్రాయం అయింది కిరణ్ బేడి. నేటి విద్యార్థులు కేవలం ఏ డాక్టర్ల ఉద్యోగాల కోసమో, ఇంజనీర్ల ఉద్యోగాల కోసమో పాకులాడకుండా సామాజిక సేవ చేయడానికి అత్యంత ప్రాధాన్యం ఉన్న పోలీసు శాఖలో కూడా ఉద్యోగాలు సంపాదించడానికి ప్రయత్నం చేసి ముందడుగు వేయాలి.

ప్రశ్నలు:

1. కిరణ్ బేడి ఆత్మ కథలు ఏ పేరుతో ఉన్నాయి ?
2. కిరణ్ బేడి రామన్ మెగసెసే అవార్డు పొందిన సంవత్సరం!
3. ప్రధాని కారును తొలగించినందుకు కిరణ్ పొందిన పేరు.
4. నవజ్యోతి సేవా సంస్థను స్థాపించిన సంవత్సరం.
5. సమాజ సేవ చేయడానికి ప్రాధాన్యత ఉన్న రంగం ఏది?

# 25. అపరిచిత గద్యం-25

హిందూ ధర్మ ఆధ్యాత్మిక వాదానికి వేదాలే శరణ్యమని ఎలుగెత్తి చాటిన వారు స్వామి దయానంద. హిందూమత నాయకులు అందరిలాగానే స్వామి దయానంద సన్యాసి, గొప్ప సంస్కృత విద్వాంసుడు. గుజరాత్ లో టంకార గ్రామంలో ఊరు చివర శివాలయం ఉంది. అక్కడ శివరాత్రి ఉత్సవం జరుగుతుంది. ఉపవాసం ఉండి భోగ్ అనే ప్రసాదాన్ని పంచేవారు. ఒక ఎలుక శివలింగం మీదకి ఎక్కి భోగ్ తినడం చూశాడు. వెంటనే అతని ముందు ఒక ప్రశ్న పుట్టింది. శివుడు శక్తివంతుడే కదా, తన మీదకెక్కిన ఎలుకను ఎందుకు కిందకు తొయ్యలేదు. అతడు తండ్రిని నిలేసి ప్రశ్నించాడు. తండ్రి జవాబు చెప్పలేకపోయాడు. మూలశంకర్ (దయానంద) మాత్రం నిద్రపోలేదు. అతని తండ్రి పేరు ఉరూ శంకర్. ఈ సంఘటన అతని జీవితాన్ని మార్చి వేసిందని చెప్పవచ్చు. కొన్నాళ్ళకు సోదరి మరణించింది. తర్వాత మేనమామ మరణించాడు. జీవిత బాధకు మరణ విమోచన మార్గం కనుగొనాలని భావించాడు. 1860లో మధుర వెళ్లి స్వామి విరజానందను కలుసుకున్నాడు. విరజానంద, దయానంద గురు శిష్య బాంధవ్యం భవిష్యత్తులో ప్రసిద్ధి చెందింది. ప్రజలందరూ మూర్ఖపు ఆలోచనల్లో ఉన్నారు. చిరు దీపం వెలిగించి వారి అజ్ఞానాన్ని తొలగించు. కుంభమేళాలో ప్రజలను ఉద్దేశించి "ఈ నదీ ప్రవాహంలో మీ తప్పులు కొట్టుకొని పోవు " అవి మీ బుద్ధిని సక్రమంగా ఉంచుకున్నప్పుడే మాయమవుతాయని ప్రబోధించారు. అనేక రంగాలలో సంస్కరణలకు నడుము కట్టాడు స్వామి దయానంద. కాలేజీలు , విద్యాలయాలు తెరిచాడు. ఈయన మత దృష్టి సిద్ధాంతాలన్నీ సత్యార్థ ప్రకాశ అనే పుస్తకంలో ఎంతో విపులంగా ఇచ్చారు. చతుర్వేదాలు దేవుని అన్వేషిస్తాయి వాటిలో తప్పులేమీ లేవు. దేవుని . ప్రపంచంలో తప్పులకు మూల కారణం ఆత్మ బంధాలు ఉండటమే. అని చెప్పాడు. 1875లో ఆర్య సమాజం స్థాపించాడు. అప్పుడు దయానంద ఉన్న ప్రాంతాన్ని పరిపాలిస్తున్న రాజును కొన్ని అభిప్రాయాలలో తిరస్కరించినందున, రాజుకు నమ్మిన వ్యక్తి అయిన జగన్నాథ్ అనే వంటవాడు 1883 వ సంవత్సరంలో దీపావళి రోజున స్వామి దయానందకు పాలలో గాజుపొడి కలిపి ఇచ్చినందున ఆయన మృత్యువు పాలయ్యాడు.

ప్రశ్నలు

1. ఉపవాసం తర్వాత పంచే ప్రసాదం ఏమిటి?
2. శివాలయం ఎక్కడ ఉంది?
3. నదీ ప్రవాహంలో తప్పులు కొట్టుకుపోవు అని దయానంద ఎక్కడ చెప్పాడు.
4.ఆర్య సమాజం స్థాపన ఎప్పుడు జరిగింది.
5. స్వామి దయానంద గురువు పేరు ఏమిటి?

This is where you can add appendices or other back matter.